

بسم اللہ الرحمٰن الرحیم

وَمَنْ يَّعْمَلْ مِنَ الصّٰلِحٰتِ مِنْ ذَكَرٍ اَوْ اُنْثٰى وَهُوَ مُؤْمِنٌ فَاُولٰٓئِكَ يَدْخُلُوْنَ الْجَنَّةَ وَلَا يُظْلَمُوْنَ نَقِيْرًا

స్త్రీలైనా పురుషులైనా (అల్లాహ్‌ను) విశ్వసించినవారై ఉండి సత్కార్యాలు చేస్తే తప్పకుండా స్వర్గంలో ప్రవేశిస్తారు.

# స్వర్గం - స్వర్గవాసులు

ناشر بہادر

BAHADUR...

بسم الله الرحمن الرحيم

# ముందుమాట

అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ వస్సలాతు వస్సలాము అలా రసూలిహిల్ కరీమ్ అమ్మబఆద్.....

## ప్రియ పాఠకులారా!

ఈ చిరు పుస్తకమునకు వీరే స్వర్గవాసులని పేరు పెట్టదలిచాను. కానీ స్వర్గవాసికి ఉండవలసిన సంపూర్ణ గుణగణాలు మరియు ఆచరణలను నేను ఎలా నిర్ణయించగలను అని నాకు సందేహం కలిగింది. అందులకై మా యొక్క స్నేహితుల దగ్గర ఈ పుస్తకంలో గల ఖుర్‌ఆన్ వాక్యములను హదీసులను ఉంచాను. వారి యొక్క అభిప్రాయాన్ని తెలుసుకొని స్వర్గం - స్వర్గవాసులని పేరు పెట్టడం జరిగింది. ఈ పుస్తకము ద్వారా స్వర్గానికి అర్హులు ఎవరు? ఏలాంటి ఆచరణలు స్వర్గానికి వెళ్ళే అర్హత సాధించి పెడతాయి అనే విషయాలను ఖుర్‌ఆన్ మరియు హదీసుల ఆధారాలతో మీ ముందు ఉంచుటకు ప్రయత్నించాము. ఈలోకంలో పుట్టిన ప్రతీ ప్రాణి మరణించక తప్పదు ఇది ప్రతి వ్యక్తి నమ్మే విషయం. ఇందులో ఎవరికి సందేహంగాని అభిప్రాయబేధం గాని లేదు. ఏక దైవారధకుడైన, బహు దైవారాధకుడైన, విగ్రహారాధకుడైన, నాస్తికుడైన, ఆస్తికుడైన అందరు మరణం ఉందని దాని నుండి ఎవ్వరూ తప్పించుకోజాలరని నమ్మే విషయం. కాని మరణించిన తరువాత మనం ఎక్కడకు వెళతాము, మన పరిస్థితి ఏమటి? అనే విషయం గురించి ఆలోచించినప్పుడే మనకు స్వర్గం - నరకం గురించి ఆలోచింపజేస్తుంది. వీటిని విశ్వసించని వాడు పరిపూర్ణ ముస్లిం కాలేడు. నేటి సమాజంలో స్వర్గం, నరకం అంటూ ఏమి లేవు అని కొట్టి పారేసే వారు చాలామంది ఉన్నారు. అల్లాహ్ మనిషిని వీర్యపు బిందువుతో పుట్టించాడు అనే విషయాన్ని మనిషి మరచిపోతున్నాడు.

తను ఏమి కానప్పుడు సృష్టించినవాడు మరణాంతర జీవితం తరువాత మరల ఎందుకు లేపలేడు. చనిపోయిన ప్రతీ వ్యక్తి అల్లాహ్ ముందు హాజరుకావలసిందే అనే విషయాన్ని నమ్మి జీవనం సాగించినప్పుడే సృష్టికర్త ఉనికిని తెలుసుకోవడానికి తద్వారా మంచి చెడుల గురించి, చెడు మనిషిని ఎక్కడకు తీసుకువెళుతుంది? మంచి ఎలాంటి ఫలితాన్ని ఇస్తుంది? అనే విషయాలను గురించి ఆలోచించగలుగుతాడు. అలా ఆలోచించే వారికి ఈ పుస్తకము ద్వారా అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించి చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారి బోధనలకు అనుగుణంగా తన జీవనం సాగించే వారికి శుభవార్త స్వర్గ సౌఖ్యాలు అందులోని భోగభాగ్యాలు, అతిథి సత్కార్యాలు, రాచ మర్యాదలు అలానే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారి బోధనలపట్ల ప్రగాఢ విశ్వాసంతో స్వర్గాన్ని పొందాలనే తాపత్రయంతో సహాబీలు (అనుచరులు) ఇహలోకంలో ఎన్ని కష్టాలు అనుభవించారో, ఎంత సహనాన్ని ప్రదర్శించారో అనే విషయాలను తెలుగు పాఠకుల ముందు ఉంచి, మనలో కూడా స్వర్గాన్ని పొందాలనే ఆశను, కోరికను జనింపజేయాలనే తాపత్రయముతో ఈ పుస్తకాన్ని మీ ముందు ఉంచుతున్నాను. అల్లాహ్ ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన మిత్రులకు, పాఠకులకు మనందరికి జన్నతుల్ ఫిర్ దౌస (స్వర్గం) లో స్థానం కల్పించాలని అల్లాహ్‌తో దు"ఆ" చేయుచున్నాను.

---

**గమనిక :**
- (స) ఉన్నచోట సల్లెల్లాహు అలైహివ సల్లమ్ అని చదువవలెను.
- (ర.జి) లేక (ర) ఉన్నచోట రజియల్లాహుతఆలాఅన్‌హూ అని చదువలెను.
- స్త్రీ కైతే (రజి.అ) రజియాల్లాహుతఆలాఅన్‌హా అని చదువవలెను.

---


**బహదుర్**

డో.నెం. 28-29-1,
ముస్లిమ్స్ కణితి RH కోలనీ,
వడ్లపూడి, విశాఖపట్నం-46.

✆ 9848067793
9951452322

డో.నెం. 24-63-2C
అబూసరంగ్ వీధి (కోట వీధి),
విశాఖపట్నం-01.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

**సిద్రతుల్ ముస్తహా దగ్గర! అక్కడే 'జన్నతుల్ మాఅవా కూడా ఉంది.**

(ఖుర్ఆన్ సూర 53 అన్-నజమ్ 14-15వ వాక్యం)

**వ్యాఖ్యానం :** మే రాజ్ సందర్భంగా దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు జిబ్రయిల్ (అలై) వారిని నిజరూపాన్ని రెండవ సారి చూశారు. సిద్రతుల్ ముస్తహా అనేది ఒక వృక్షం ఏడవ ఆకాశంలో ఉంది. ఆ హద్దునుదాటి జిబ్రాయిల్ దూత ముందుకుపోలేరు. దైవాజ్ఞలను కూడా దైవదూతలు ఇక్కడి నుండే పొందుతారు. మహాప్రవక్త (సల్లం) మేరాజ్ సందర్భంగా ఆ వృక్షాన్ని చూచినట్లు చెప్పబడింది. ఆ వృక్షం చుట్టూ బంగారు దూదిపురుగులు ఎగురుతూ ఉంటాయి. దైవదూతల ప్రతిబింబం దానిపై అవలీలగా పడుతూ ఉంది. అల్లాహ్ తేజస్సు కూడా అక్కడ తొణికిసలాడుతూ ఉంది ఆ ప్రదేశం దగ్గరే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారికి మూడు కానుకలు వొసంగబడ్డాయి:

1. ఐదు పూటల నమాజులు 2. అల్ బఖరా సూరా చివరి ఆయతులు 3. షిర్క్ కాలుష్యానికి దూరంగా ఉండే ముస్లింలకు క్షమాభిక్ష ప్రసాదించబడుతుందన్న వాగ్దానం.

(ముస్లిం, కితాబుల్ ఈమాన్ బాబ్ జిక్ర్ సిద్రతుల్ మున్తహా)

'జన్నతుల్ మావా' (స్వర్గదామం) అనటానికి ఒక కారణం ఏమిటంటే ఆదం (అలై) నివాస స్థలం అక్కడే ఉండేది. ఆత్మలు ఈ ప్రదేశంలోనే వచ్చి చేరుతాయని కొంతమంది విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు (పత్హుల్ ఖదీర్)

*అయితే విశ్వసించి, సత్కార్యాలు కూడా చేసినవారికి ఆతిథ్యంగా ఫిర్దౌస్ వనాలు ఉన్నాయి.*

(ఖుర్ఆన్ 18వ సూరహ్ అల్కహఫ్ 107వ వాక్యం)

**వ్యాఖ్యానం :** 'ఫిర్‌దౌస్' అనేది స్వర్గంలోని అత్యున్నత స్థానం (జన్నతుల్ ఫిర్దౌస్). అందుకే మీరు అల్లాహ్‌ను స్వర్గం కోరినప్పుడల్లా జన్నతుల్ ఫిర్దౌస్‌ను కోరండి. స్వర్గంలోని సెలయేరులన్నీ అక్కడి నుంచే పుడతాయి అని మహాప్రవక్త (సల్లం) ఉపదేశించారు.

(బుఖారి 4 - పేజి 263 & 8 కితాబుత్తౌహీద్ 549 పేజి)

*నిశ్చయంగా విశ్వాసులు సాఫల్యం పొందారు. వారు తమ నమాజులో అణుకువ కలిగిఉంటారు. వారు పనికిమాలిన వాటిని పట్టించుకోరు. వారు (తమపై విధించబడిన) జకాతు విధానాన్ని పాటిస్తారు, తమ మర్మ స్థానాలను కాపాడుకుంటారు. అయితే తమ భార్యల (షరీయతు ప్రకారం) తమ ఆధీనంలోకి వచ్చిన బానిసరాళ్ళ విషయంలో ఎలాంటి నిబంధన లేదు. కాని ఎవరయినా దీనికి మించి మరేదైనా కోరితే వారే హద్దుమీరిన వారవుతారు. వారు తమ అప్పగింతల వాగ్దానాల పట్ల కడు అప్రమత్తంగా ఉంటారు. వారు తమ నమాజులను పరిరక్షిస్తూ ఉంటారు. అలాంటి వారే (స్వర్గంలోని) ఫిరదౌసు ప్రవేశానికి వారసులు. వారక్కడ కలకాలం ఉంటారు.*

(ఖుర్ఆన్ 23వ సూర అల్ మూమినూన్ 1-11 వాక్యములు)

వ్యాఖ్యానం : పై వచనములో చెప్పబడిన సుగుణాలు గల విశ్వాసులు మాత్రమే స్వర్గానికి వారసులవుతారు అదీ దేనికి?! స్వర్గంలోని అత్యున్నత విశిష్ఠతగల జన్నతుల్ ఫిర్‌దౌస్‌కి!

వాస్తవానికి సాఫల్యం పొందేవారెవరంటే ఇహలోక జీవితంలో వచ్చే కష్ట సుఖాలను అనుభవిస్తూ అల్లాహ్ ఒక్కడే ఆరాధ్య దైవం అని విశ్వసిస్తూ సత్‌కర్మలు చేస్తూ, సృష్టికర్తకు భయపడుతూ (దైవభీతి) కల్గి దైవాన్ని ప్రసన్నుణ్ణి చేసుకొనినవాడే సాఫల్యుడు. ప్రార్థన నమాజును ఏకాగ్రతతో ప్రవక్త (స) గారి పద్ధతి ప్రకారంగా వినయ విధేయతా భావం కల్గి, మమ్ములను అల్లాహ్ చూస్తున్నాడు అని భావించి, నమాజు చేయాలి. అంతేగాని

ఇమామ్ గారు చదివిస్తున్నారు కదా! ఆయన వంగుంటే వంగోవడం ఆయన నిలబడితే నిలబడటం కాదు, ఆయన ఖుర్ఆన్ ఏమి చదువుతున్నారు, దానిలో ఏవైనా వాక్యాల యొక్క అర్థం మనకు తెలిసినవి వస్తున్నాయా? ఆయన నమాజు మనకు ప్రవక్త (స) పద్ధతి ప్రకారం చదివిస్తున్నారా? లేదా అని గమనిస్తూ చదవాలి ఒకవేళ ఇమామ్ ప్రవక్త (స) గారి పద్ధతిని విడనాడితే ఆ నమాజు నమాజు కాదు. అలాంటివారి వెనుక నమాజ్ కాజాలదు.

*(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు వీటికన్నా మేలైనదేదో నేను మీకు తెలుపనా? దైవభక్తి కలవారికి వారి ప్రభువు వద్ద స్వర్గ వనాలున్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహి స్తుంటాయి. వాటిలో వారు ఎల్లకాలం ఉంటారు. పవిత్రురాలైన భార్యలు వారి కోసం ఉంటారు (వీటన్నింటితో పాటు) అల్లాహ్ ప్రసన్నత వారికి ప్రాప్తిస్తుంది. అల్లాహ్ తన దాసులను కనిపెట్టుకొని ఉన్నాడు.*

(ఖుర్ఆన్ 3వ సూర అలిఇమ్రాన్ 15వ వాక్యం)

**వ్యాఖ్యానం :** మీరు ప్రపంచంలోని వస్తువుల పట్ల మోజు పెంచుకుని సర్వస్వం ఇదేనని భ్రమ పడకండి. నిజానికి దైవం వద్ద మీ కోసం సిద్ధం చేసి ఉంచబడినది ఇంతకన్నా మేలైనది, అత్యున్నతమైన స్వర్గం అది కేవలం దైవభక్తి పరాయణులకు మాత్రమే లభిస్తుంది. స్వర్గంలో పాల కాలువలు, తేనె, మధురమైన నీటి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వీటి రుచి, మన ఊహకు కూడా అందనిది. అల్లాహ్ ప్రసన్నత అవ్వడమంటే ఒక హదీసు గుర్తుకు వచ్చింది. స్వర్గవాసులతో అల్లాహ్ ప్రశ్నిస్తాడు ఓ స్వర్గవాసులారా! మీరంతా సంతోషంగా ఉన్నారా? ఓ అల్లాహ్ ఉన్నాము, అప్పుడు అల్లాహ్ మీకు మహోన్నత కానుక ఇవ్వనా? ఇంకా మేలైనదా! అవును నేను మీతో ప్రసన్నుడైనాను. నేను ఎప్పుడూ (నారాజ్) అవ్వను.

(బుఖారి 8 బాబ్ సిఫతెల్ జన్నతి వన్నార్, 33వ పేజి & పేజి 615)

*తమ ప్రభువుకు భయపడుతూ మసలుకునే వారికోసం క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలున్నాయి. వాటిలో వారు కలకాలం ఉంటారు. ఇది అల్లాహ్ వద్ద నుంచి వారికి లభించే ఆతిథ్యం. సద్వర్తనుల కోసం అల్లాహ్ వద్ద ఉన్నది అన్నింటికంటే శ్రేష్ఠమైనది.*

(ఖుర్ఆన్ 3వ సూర అలి ఇమ్రాన్ 198వ వాక్యం)

వ్యాఖ్యానం : పైన పేర్కొనబడిన వారి విధంగా అల్లాహ్ పట్ల భయభక్తులతో జీవితం గడుపుతూ సదాచరణ చేస్తూ ఉండేవారికి వారి వద్ద ఆస్తి, అంతస్తులు, పలుకుబడి లేకపోవచ్చు అయినాసరే దైవ సన్నిధిలో వారు ఆదరించబడతారు. వారు దేవుని ఆతిథ్యం పొందుతారు. ప్రపంచంలో అవిశ్వాసులకు, ముష్రిక్కులకు లభించిన భాగ్యాల కన్నా విలువైన, అతి శ్రేష్ఠమైన భాగ్యాలు ఈ సజ్జనులకు సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ దగ్గర లభిస్తాయి.

*విశ్వసించిన ఇలాంటి స్త్రీ పురుషులకు, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గ వనాలను ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అక్కడ వారు కలకాలం ఉంటారు. శాశ్వతంగా ఉండే స్వర్గవనాలలో పరిశుభ్రమైన మేడలు వారి కొరకు ఉంటాయి. వీటన్నింటికి మించి అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. గొప్ప సాఫల్యం అంటే ఇదే.*

(ఖుర్ఆన్ 9వ సూర తౌబా 72వ వాక్యం)

వ్యాఖ్యానం : ఈ వచనంలో స్త్రీలను, పురుషులను సంబోధించడం జరిగింది. స్వర్గంలో భవంతులు ఉంటాయని, దాని గోడలు ఒక బంగారపు ఇటుక, రెండవది వెండి ఇటుక వీటి మధ్యలో ముత్యాలు, పగడాలు అమర్చబడి ఉంటాయి. స్వర్గంలోని భవనాలలో ముత్యాలు, పగడాలు పొదగబడి అందంగా అలంకరించబడి ఉంటాయి. స్వర్గవాసులకు స్వర్గంలో ప్రాప్తించే అనుగ్రహాలన్నింటి కన్నా దైవ ప్రసన్నత రూపంలో లభించే వరం ఎంతో గొప్పది.

*విశ్వసించి, సత్కార్యాలు చేసినవారి విషయం నిశ్చయంగా మేము ఉత్తమ ఆచరణ చేసినవారి ప్రతిఫలాన్ని వృథా కానివ్వము. వారి కోసం శాశ్వతమైన స్వర్గవనాలున్నాయి. వారి క్రింద నుంచి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారు బంగారు కంకణాలు తొడిగించబడతారు. సన్నగానూ, దళసరిగా ఉండే సుతిమెత్తని ఆకుపచ్చ రంగుగల పట్టు వస్త్రాలు ధరిస్తారు. వారక్కడ ఆసనాలపై (దిండ్లకు) ఆనుకొని ఆసీనులై ఉంటారు. ఎంత చక్కటి పుణ్యఫలం అది! ఎంత అమోఘమైన విశ్రాంతి నిలయం అది!!*

(ఖుర్ఆన్ 18వ సూర కహఫ్ 30-31వ వాక్యములు)

వ్యాఖ్యానం : దివ్య ఖుర్ఆన్ అవతరించే కాలంలోనూ, అంతకుముందు కాలంలోనూ రాజులు, శ్రీమంతులు తమ చేతులకు బంగారు మురుగులు ధరించేవారు. ఇది అప్పటి ఆచారం. దీనివల్ల సమాజంలో వారి ప్రత్యేకత వ్యక్తమయ్యేది. ఆ విషయాన్నే ఖుర్ఆన్ ప్రస్తావిస్తూ స్వర్గవాసులకు కూడా అదృష్టం ప్రాప్తమవుతుందని తెలిపింది. ప్రాపంచిక జీవితంలో బంగారు నగలు వేసుకోవటం పట్టు వస్త్రాలు ధరించటం పురుషులకు నిషేధించబడింది. ఎవరైతే ఈ దైవాదేశాన్ని శిరసావహిస్తూ ఈ నిషిద్ధాంశాలకు దూరంగా ఉంటారో వారికి స్వర్గంలో ఈ వస్తువులన్నీ ప్రాప్తమవుతాయి. స్వర్గవాసులకు ఏ వస్తువుపై నిషిద్ధం కాదు. అక్కడ వారు కోరినదల్లా లభిస్తుంది. "ఏ వస్తువుపై మీ మనసు పడినా, మీరు ఏది కోరినా అది స్వర్గంలో ఉంటుంది."

(41:31)

*విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి క్రింద సెలయేరులు పారే (స్వర్గ) వనాలలో అల్లాహ్ ప్రవేశం కల్పిస్తాడు. అక్కడ వారు బంగారు కంకణాలు తొడిగించబడతారు. స్వచ్ఛమైన ముత్యాలు కూడా! వారు*

*ధరించే వస్త్రాలు కూడా పట్టు వస్త్రాలై ఉంటాయి.*

(ఖుర్‌ఆన్ 22వ సూర హజ్జ్ 23వ వాక్యం)

*అయితే తమ ప్రభువుకు భయపడుతూ ఉండే వారికోసం (అంతస్తులుగా కట్టబడిన) మేడలున్నాయి. వాటిపై (మరిన్ని) అంతస్తులు నిర్మించబడి ఉన్నాయి. మరి వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉన్నాయి. అల్లాహ్ వాగ్ధానం ఇది. అల్లాహ్ తన వాగ్ధానానికి విరుద్ధంగా చేయడు.* (ఖుర్‌ఆన్ 39వ సూర జుమర్ 20వ వాక్యం)

వ్యాఖ్యానం : దీని అర్థం ఏమిటంటే స్వర్గంలో ఎన్నో అంతస్థులు ఉంటాయి. పలు అంతస్థులు పెద్ద పెద్ద భవనాలు అత్యధికంగా ఉంటాయి. స్వర్గ వాసులలోని వివిధ శ్రేణులను బట్టి వారికి ఆయా స్థానాలు (అంతస్తులు) కేటాయించబడతాయి. ఆ భవనాల వద్ద స్వర్గవాసుల అభిరుచికి అనుగుణంగా మద్యం (నషా చేయనిది) పాలు, త్రాగునీరు, తేనెల పిల్లకాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అల్లాహ్ విశ్వాసులైన తన దాసులకు స్వర్గం గురించి వాగ్ధానం చేసి ఉన్నాడు. దేవుడు చేసిన వాగ్ధానం తప్పక నెరవేరుతుంది. ఆయన వాగ్ధానానికి వ్యతిరేకంగా చేసేవాడు కాడు.

*శాశ్వతంగా ఉండే స్వర్గవనాలలోకి వారు ప్రవేశిస్తారు. వారి పూర్వీకులలో, వారి భార్య బిడ్డలలో సజ్జనులైన వారు కూడా (వారితో పాటే స్వర్గానికి వెళతారు) దైవదూతలు అన్ని ద్వారాల నుండి వారి వద్దకు వస్తారు.* (ఖుర్‌ఆన్ 13వ సూర, ర్రాద్ 23వ వాక్యం)

వ్యాఖ్యానం : స్వర్గ వనాలలో ప్రవేశించే వారితో వారి రక్త సంబంధీకుల్లోని సజ్జనులను కూడా అల్లాహ్ ఒకచోట చేరుస్తాడు. ఒకరినొకరు చూసుకొని ఆనందిస్తారు. ఆవిధంగా వారి కళ్ళకు చలువ ప్రాప్తిస్తుంది. స్వర్గంలో తక్కువ (క్రింద) శ్రేణిలో ఉండే బంధువులను కూడా అల్లాహ్ ఉన్నత శ్రేణిలో ఉన్న బంధువులతో కలుపుతాడు. ఈవిధంగా సెలవిచ్చాడాయన "విశ్వసించిన

వారితోపాటు వారి సంతానం కూడా విశ్వసించి వారిని అనుసరించి ఉంటే, వారి సంతానాన్ని కూడా మేము వారితో కలుపుతాము. వారి పుణ్యఫలాన్ని మేము ఏమాత్రం తగ్గించము (తూర్-21) ఈ వచనము ద్వారా బోధపడే మరో ముఖ్య విషయం ఏమిటంటే, విశ్వసించి, సత్కార్యాలు చేసిన బంధుమిత్రులను దేవుడు స్వర్గంలో ఒకచోట చేరుస్తాడు. అంతేగాని దేవునిపై విశ్వాసం సదాచరణలేని ఎంతటి అత్యంత సమీప బంధువులైనప్పటికి వారు తమ వాళ్ళను స్వర్గంలో కలుసుకోలేరు సరికదా ఇటువంటి వారికి స్వర్గ ప్రవేశమే లభించదు. ఒక హదీసులో ఇలా చెప్పబడింది. ఎవరి కర్మ "అయితే అతన్ని వెనక్కి నెట్టివేసిందో అతని వంశం అతన్ని ముందుకు తీసుకుపోజాలదు."

(సహీమ్ ముస్లిం - కితాబుజ్జిక్ర్ వద్దుఆ)

*... కానీ పశ్చాత్తాపం చెంది విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు మాత్రం నష్టపోరు. వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవ్వంత కూడా అన్యాయం జరగదు. అగోచరాలైన, శాశ్వత స్వర్గ వనాలలోకి (వారు ప్రవేశిస్తారు) వాటిని గురించి కరుణామయుడు (ఆయన అల్లాహ్) తన దాసులకు వాగ్దానం చేశాడు. ఆయన వాగ్దానం నెరవేటం తథ్యం. అక్కడ వారు సలామ్ తప్ప వ్యర్థమైన మాటలేవీ వినరు. వారికోసం అక్కడ ఉదయం, సాయంత్రం వారి ఆహారం సమకూరుతూ ఉంది. నేను నా దాసులలలో భయభక్తులు కలిగి ఉండేవారిని వారసులుగా చేసే స్వర్గం ఇదే.* (ఖుర్ఆన్ 19వ సూర మర్యమ్, 60-63వ వాక్యం)

వ్యాఖ్యానం : ఎవరైతే అవిశ్వాస వైఖరిని మానుకొని సృష్టికర్త అల్లాహ్ మాత్రమే ఆరాధ్యదైవంగా విశ్వసించి, గతించిన పాపాలకు అల్లాహ్‌తో క్షమాభిక్ష పెట్టుకొని పశ్చాత్తాపం చెందుతారో ఇలాంటి

విశ్వాసులకు సంబోధించే వాక్యం ఇది. ఇదే అగోచర విషయాలపై విశ్వాసం అంటే. ఇది వారి ధృఢ విశ్వాసానికి ప్రతీక! వారు స్వర్గాన్ని ఎన్నడూ చూడలేదు. కాని అల్లాహ్ చేసిన వాగ్దానం ఆధారంగా వారు ఆ స్వర్గలోకం పొందే తపనలో విశ్వసించారు. మంచి పనులు చేశారు. హదీసు ప్రకారం స్వర్గంలో ప్రవేశించే మొదటివర్గం వారి ముఖాలు పూర్ణచంద్రుని వలె ప్రకాశిస్తూ ఉంటాయి. అక్కడ వారికి ఉమ్మి, చీముడు వంటివి రావు. మలమూత్ర విసర్జన వంటివి ఉండవు. వారి పాత్రలు, దువ్వెనలు బంగారంతో చేయబడినవై ఉంటాయి. వారి సుగంధ చెక్కలు గుబాళిస్తూ ఉంటాయి. వారికి పట్టే చెటమ కస్తూరి వాసన కలిగి ఉంటుంది. (బుఖారి సూరమర్యమ్ వ్యాఖ్యానం)

*శాశ్వతమైన స్వర్గవనాలున్నాయి. వాటిక్రింద సెలయేళ్ళు ప్రవహిస్తుంటాయి. వాటిలో వారు కలకాలం ఉంటారు. పరిశుద్ధుడైన ప్రతి వ్యక్తికి లభించే ప్రతిఫలం ఇదే.*

(ఖుర్ఆన్ 20వ సూర తాహా 76వ వాక్యం)

వ్యాఖ్యానం : విశ్వసించిన మీదట రుజుమార్గంపై నిలకడ చూపి సత్కార్యాలు చేసి, తమ హృదయాలను పాపకార్యాల నుంచి కాపాడుకుని పవిత్ర జీవితం గడిపిన వారికి మాత్రమే ఈ స్వర్గసుఖాలు ప్రాప్తిస్తాయి. ఎందుకంటే ఈమాన్ అనేది నోటితో పలికే కొన్ని వచనాలకు మారు పేరు కాదు. విశ్వాసంతో పాటు, చిత్తశుద్ధితో కూడిన సదాచరణ ఈ రెండింటి సమాహారమే నిజమైన ఈమాన్.

*కలకాలం నిలిచే స్వర్గ వనాలున్నాయి. వాటిలో వారు ప్రవేశిస్తారు. అక్కడ వారు స్వర్ణ కంకణాలతో ముత్యాలతో ముస్తాబు అవుతారు. వారు ధరించే వస్త్రాలు పట్టువస్త్రాలై ఉంటాయి.*

(ఖుర్ఆన్ 35వ సూర, ఫాతిర్ 33వ వాక్యం)

వ్యాఖ్యానం : "ఇహలోకంలో పురుషులు బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలను ధరించకండి. ఇహ లోకంలో వాటిని ధరించినవాడు పరలోకములో ధరించడు" అని హదీసులలో చెప్పబడింది. (సహీ బుఖారి, సహీ ముస్లిం కితాబుల్లిబాస్)

*అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు; నిశ్చయంగా సృష్టిలో వారే అందరికన్నా ఉత్తములు. వారికి ప్రతిఫలంగా వారి ప్రభువు దగ్గర శాశ్వతమైన స్వర్గవనాలున్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వాటిలో వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వారిపట్ల ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతోషపడ్డారు ఈ అనుగ్రహ భాగ్యం తన ప్రభువుకు భయపడే వానికి మాత్రమే.*

(ఖుర్ఆన్ 98వ సూర బయ్యినహ్, 7-8వ వాక్యం)

వ్యాఖ్యానం : అంటే హృదయపూర్వకంగా అల్లాహ్‌ను దైవంగా విశ్వసించి, దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ను అంతిమ ప్రవక్తగా విశ్వసించి మంచి పనులను ధన పరంగానూ, శారీరకంగానూ చేసివారు సృష్టిలో ఉన్న జీవరాశులన్నింటికన్న శ్రేష్ఠులుగా ఖరారు చేయబడతారు. విశ్వాసులైన మనుషులు దైవదూతల కన్నా గొప్పవారు. దానికి వారి విశ్వాసం (ఈమాన్) విధేయత, సదాచరణ మూలంగా వారికి ఈ అనుగ్రహ భాగ్యం దక్కింది" "అల్లాహ్ ప్రసన్నత అన్నింటికన్నా గొప్పది."

(ఖుర్ఆన్ 9వ సూర, అత్‌తౌబ 72వ వాక్యం)

ఇహలోకంలో దైవానికి నిత్యం భయపడుతూ, దేవుని అవిధేయతకు ఒడిగట్టకుండా జాగ్రత్తగా జీవితం గడిపిన వారికి మాత్రమే ఈ వరాలు ప్రత్యేకం. ఒకవేళ ఎప్పుడైన మానవ సహజమైన దౌర్బల్యం వల్ల తప్పు జరిగిపోయినా వారు వెంటనే తమ తప్పును గ్రహించి ప్రశ్చాత్తాపపడతారు. క్షమాపణ కోరుకుంటారు. ఇక మీదట అలాంటి తప్పు జరగకుండా జాగ్రత్త

పడతారు. చివరకు వారు విశ్వాసస్థితిలోనే తనువు చాలిస్తారు. నిజంగా దేవునికి భయపడినవారు పదే పదే పాపకార్యాలు చేయరు. ఎవరైతే ఇలా చేస్తాడో వాడి మనస్సులో దైవభీతి లేనట్లేనని భావించాలి.

*నిశ్చయంగా దైవభీతి పరాయణులు సురక్షిత (ప్రశాంత) స్థలంలో ఉంటారు. ఉద్యానవనాల, చెలమల మధ్యన, పల్చటి సిల్కు వస్త్రాలను, దళసరి పట్టువస్త్రాలను ధరించి ఎదురెదురుగా ఆసీనులై ఉంటారు.*

(ఖుర్ఆన్ 44వ సూర, దుఖ్ఖాన్ 51-53వ వాక్యములు )

వ్యాఖ్యానం : పాపాత్ములకు, అవిశ్వాసులకు ప్రతిగా ఇక్కడ విశ్వాసుల, దైవభీతిపరుల స్థానం గురించి చెప్పబడింది. వారు తిరస్కార వైఖరినుండి, పాపకార్యాలనుండి తమను తాము రక్షించుకున్నవారు. అందుకే వారికి ఏ చీకూ చింతా లేని ప్రశాంత వాతావరణంలో చోటు లభిస్తుంది. "మకానున్ అమీన్" అంటే ఎలాంటి భయాందోళనలు, దుఃఖ విచారాలు కలగని స్థలం అని అర్థం.

*వారి సహనానికి బదులుగా వారికి స్వర్గాన్నీ పట్టు వస్త్రాలను ప్రసాదించాడు. వారక్కడ దిండ్లకు ఆనుకొని పీఠాలపై కూర్చుని ఉంటారు. అక్కడవారు సూర్యతాపాన్నిగానీ, చలి తీవ్రతను గానీ చూడరు. స్వర్గవనాల నీడలు వారిపై పడుతూ ఉంటాయి. వాటి పండ్లు గుత్తులు క్రిందికి వ్రేలాడుతూ (అందుబాటులో) ఉంటాయి. వారి సేవలో వెండి పాత్రలు, గాజు గిన్నెలు తిప్పబడుతూ ఉంటాయి. ఆ గాజు గిన్నెలు కూడా వెండివై ఉంటాయి. వాటిని (నింపేవారు) ఒక అంచనా ప్రకారం సరిగ్గా నింపి ఉంటారు. వారికి అక్కడ సొంటి కలిపిన మధుపాత్రలు త్రాగడానికి ఇవ్వబడతాయి. స్వర్గంలోని ఒక సెలయేరు నుండి దానిపేరు సల్సబీల్.*

(ఖుర్ఆన్ 76వ సూర, అద్ దహ్ర 12-18వ వాక్యములు)

వ్యాఖ్యానం : సహనం (సబ్ర్) అంటే దైవమార్గంలో ఎదురైన కష్ట నష్టాలను మనస్ఫూర్తిగా సహించటం. దైవ విధేయతా యత్నంలో మనోవాంఛలను అదుపులో పెట్టుకోవటం పాపాలకు దూరంగా ఉండటం అని అర్థం. స్వర్గంలోని వాతావరణం ఎప్పుడూ ఒకే విధంగా ఉంటుంది. అక్కడ తీవ్రమైన వేడిగాని ఎముకలు కొరికే చలిగానీ ఉండదు. అక్కడి వాతావరణం మధ్యస్థంగా ఉంటుంది. అక్కడ ఎండ తాపం ఉండనప్పటికీ స్వర్గ వనాల నీడలు స్వర్గవాసులపై పడుతూ ఉంటాయి. చెట్ల కొమ్మలువారికి దగ్గరగా వంగి ఉంటాయి. పండ్లు గుత్తులు వారి ముందు వాలి ఉంటాయి. స్వర్గవాసులు ఎప్పుడూ ఏ పండ్లు తినాలనుకున్నా అదివారికి అందుబాటులో ఉంటాయి. వారు కూర్చుని ఉన్నా పడుకొని ఉన్నా ఆ పండ్లు సునాయాసంగా త్రెంచుకొనే విధంగా వారి అందుబాటులో ఉంటాయి.

*మరెవరు విశ్వసించి సత్కార్యాలు చేస్తారో వారిని మేము, క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలోకి తీసుకుపోతాము. వాటిలో వారు కలకాలం ఉంటారు. వారికోసం అక్కడ పవిత్రులైన భార్యలుంటారు. ఇంకా మేము వారిని దట్టమైన నీడల్లోకి (మరియు పరిపూర్ణ సౌఖ్యంలోకి) తీసుకుపోతాము.*

(ఖుర్ఆన్ 4వ సూర నిసా 57వ వాక్యము)

వ్యాఖ్యానం : అవిశ్వాసులకు ప్రతిగా విశ్వాసులకు లభించే శాశ్వత సుఖాల ప్రస్తావన ఈ వాక్యంలో చెప్పబడింది. అయితే విశ్వసించటంతో పాటు సత్కార్యాలు చేసినవారికి మాత్రమే ఈ అనుగ్రహాలు లభిస్తాయి. దివ్య ఖుర్ఆన్‌లో "విశ్వాస" (ఈమాన్) ప్రస్తావన వచ్చినప్పుడల్లా సత్కార్యాల (అమలుస్సాలెహ్) ను కూడా ప్రస్తావించి ఈ రెండింటికీ మధ్య విడదీయరాని సంబంధం ఉందని అల్లాహ్ స్పష్టం చేశాడు. సదాచరణ లేని విశ్వాసం

సువాసన లేని కాగితపు పువ్వులాంటిది. పండ్లు ఫలాలు ఇవ్వని వృక్షం లాంటిది. ప్రవక్త ప్రియ సహచరులు (రజి) ఉత్తమ తరాలకు చెందిన ముస్లింలు ఈ విషయాన్ని వారు బాగా జీర్ణించుకున్నారు. అందుచేత వారి జీవితాలు విశ్వాస పువ్వులతో, సత్కార్యాల ఫలాలతో నిండివుండేవి.

కానీ ఈనాడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విశ్వాసం (ఈమాన్) అనేది ప్రసంగాలకు, హితబోధలకే పరిమితం అయింది. సత్కార్యాలు చేశామని గొప్పలు చెప్పకునే వారిలో విశ్వాసం లోపించింది. కొంతమంది తాము ఫలానా ఫలానా మంచి పనులు సంక్షేమ కార్యాలు చేశామని అంటారు. విశ్వాసం లేని వారు చేసే ప్రజోపయోగ పనులు ప్రపంచంలో వారి పేరు ప్రతిష్ఠల్ని ఇనుమడిస్తాయేమోగాని, అల్లాహ్ సమక్షంలో మాత్రం వాటికి ఎలాంటి విలువా, ఆదరణా ఉండదు. ఎందుకంటే వారుచేసిన ఈ సత్కార్యాలు ఈమాన్ (విశ్వాస) ఆధారంగా చేసినవి కావు. ప్రాపంచిక కీర్తి ప్రతిష్ఠల వరకే వారి సంక్షేమ కార్యక్రమాల పరిమితం అయ్యాయి. శ్రేయోభిలాషులుగా, సంస్కర్తలుగా లోకం వారిని కొనియాడుతుంది. అంతేగాని వారికి పరలోకంలో ఎలాంటి ప్రతిఫలం లభించదు.

*ఓ నా దాసులారా! ఈరోజు మీకెలాంటి భయం గానీ, దుఃఖం గానీ ఉండదు. మా సూచనలను విశ్వసించి, విధేయులు (ముస్లింలు)గా ఉన్న వారి నుద్దేశించి (ఈవిధంగా అనబడుతుంది) మీరూ మీ భార్యలూ సంతోషంగా (సగౌరవంగా) స్వర్గంలో ప్రవేశించండి. వారి వద్దకు నలువైపుల నుంచి బంగారు పళ్ళాలూ, బంగారు గ్లాసులూ తేబడతాయి. మనసు కోరేవి, కళ్ళు ఆస్వాదించేవీ అన్నీ అక్కడ ఉంటాయి. అందులో మీరు కలకాలం (సుఖంగా) ఉంటారు. ఈ స్వర్గం మీరు చేసుకున్న*

*సత్కర్మలకు బదులుగా మీరు దీనికి వారసులయ్యారు.*

(ఖుర్ఆన్ 43వ సూర, జుఖ్రుఫ్ 68-72వ వాక్యములు)

వ్యాఖ్యానం : ప్రాపంచిక జీవితంలో కేవలం అల్లాహ్ మరియు ప్రవక్త (స) ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో ఒకరినొకరు ప్రేమించే వారిని ఉద్దేశించి చెప్పబడిన మాటలివి. పురుషులకే కాదు స్త్రీలనూ ఉద్దేశించి కూడా చెప్పబడింది. విశ్వాసం కలిగిన భార్యభర్తలిద్దరూ ఆ స్వర్గవనాలలో కలకాలం ఉంటారు. ప్రపంచంలో సంపాదించిన ధనం, ఆస్థిపాస్తులు, తనవారికి (వారసులకు) వదలి వెళతారు. కాని తన తోడుగా తీసుకొని వెళ్ళే ధనం ఏమనగా తను విశ్వాసిగా ఉండి చేసుకున్న సత్‌కర్మలే దానికి బదులే స్వర్గం వారసత్వంగా లభిస్తుంది. ఈ విషయాన్ని మనం మరువరాదు సుమా!

*ఆరోజు (ప్రళయదినాన) విశ్వాసులైన పురుషులను, విశ్వాసులైన స్త్రీలను నీవు చూస్తావు. వారి కాంతి వారికి ముందువైపున, కుడి వైపున పరుగెడుతూ ఉంటుంది. ఈరోజు మీకో శుభవార్త! క్రింది కాలువలు ప్రవహించే స్వర్గ వనాలు మీకోసం ఉన్నాయి. అందులో మీరు కలకాలం ఉంటారు. ఇదే గొప్ప సాఫల్యం! (అని వారితో అనబడుతుంది)* (ఖుర్ఆన్ 57వ సూర, హదీద్ 12వ వాక్యం)

వ్యాఖ్యానం : ఈ వాక్యములలో కూడా విశ్వాసులైన స్త్రీ పురుషులను సంబోధిస్తూ స్వర్గానికి వెళ్ళేముందు ఒక వారధి (బ్రిడ్జి) ఉంటుంది. అది ప్రతీ ఒక్కరూ కూడా దాటవలసిందే. పరలోకంలో 'పుల్‌సిరాత్' (వారధి) ని దాటుతున్నప్పుడు విశ్వాసులకు వారి విశ్వాసం (ఈమాన్) మరియు సదాచరణ (అమలు స్సాలెహ్) కు ప్రతిఫలంగా ఈ కాంతి ప్రసరిస్తూ ఉంటుంది. ఈ కాంతిలో వారు స్వర్గలోక బాటను తొందరగా అధిగమిస్తారు. అలానే ఈ వచనములో స్వాగతం పలకటానికి, అతిథి మర్యాదలు చేయటానికి సిద్ధంగా ఉన్న దైవదూతలు పలికే మాటలను కూడా

చెప్పబడింది. మీరు ఇహలోకంలో చేసినదానికి బదులు ఇదే గొప్ప సాఫల్యం అంటూ దైవదూతలు స్వర్గవాసులను ఆహ్వానిస్తూ ఉంటారు.

*నిశ్చయంగా దైవభీతి పరాయణులు సురక్షిత (ప్రశాంత) స్థలంలో ఉంటారు. ఉద్యాన వనాల, చెలమల మధ్యన పల్చటి సిల్కు వస్త్రాలను, దళసరి పట్టు వస్త్రాలను ధరించి ఎదురెదురుగా ఆసీనులై ఉంటారు. (భక్తి పరాయణుల పట్ల) ఇలాగే వ్యవహరించబడుతుంది. (అంతేకాదు) పెద్ద పెద్ద కన్నులు గల (హూరు) అందగత్తెలతో మేము వారి వివాహం జరిపిస్తాము. వారక్కడ నిక్షేపంగా (కూర్చుని) అన్ని రకాల పండ్లు ఫలాదులను తెప్పించుకుంటూ ఉంటారు. మొదటిసారి వచ్చిన మరణం తప్ప మరింకా వారు అక్కడ మరణం రుచి చూడటమనేదే ఉండదు. నరకాగ్ని శిక్ష నుండి అల్లాహ్ వారిని రక్షించాడు.*

(ఖుర్ఆన్ 44వ సూర, దుఖ్ఖాన్ 51-56వ వాక్యములు)

వ్యాఖ్యానం : అవిశ్వాసులకు ప్రతిగా ఇక్కడ విశ్వాసుల, దైవభీతి పరుల స్థానం గురించి చెప్పబడింది. వారు పాపకార్యముల నుండి తమను తాము రక్షించుకున్నారు. అందుకే వారికి ఏ చీకూ చింతా లేని ప్రశాంత వాతావరణంలో చోటు లభిస్తుంది. మకానున్ అమీన్ అంటే ఎలాంటి భయాందోళనలు, దుఃఖ విచారాలు కలగని స్థలం అని అర్థం.

అరబీలో హూర్ అని ఉంది కంటిలోని తెల్లగుడ్డు అత్యంత తెలుపు రంగులోనూ నల్లగుడ్డు కనుపాప గాఢమైన నలుపు రంగు లోనూ ఉండటాన్ని హూర్ అని అంటారు. హూర్ అనే పదం హైరాన్ నుంచి వచ్చిందని కూడా చెబుతారు. హైరాన్ అంటే నిర్ఘాంత పోవటం, సంభ్రమాశ్చర్యానికి లోనవటం ఖాయం. అందుకే స్వర్గ కన్యలను హూర్ అని పిలుస్తారు. వారు కళ్ళు చెదిరే అందంతో సువిశాలమైన కన్నులు కల్గి ఉంటారు.

స్వర్గంలోని ఆహార పదార్థాలు తరిగి పోతాయన్న భయంగానీ, వాటిని తినటం వలన అజీర్తి కలుగుతుందన్న భయంగానీ, అలసిపోతామన్న దిగులుగానీ షైతాన్ దుష్ప్రేరణలకు లోనవుతామేమోనన్న భయంగాని వారికి ఉండదు. ఇహలోకంలో వచ్చిన మరణం తరువాత పరలోకంలో మరణం రాదు. హదీసు ప్రకారం తీర్పు జరిగిపోయిన తరువాత మృత్యువు ఒక పొట్టేలు రూపంలో ప్రత్యక్ష పరచబడుతుంది. దానిని స్వర్గ, నరకాల మధ్య ఉంచి జిబహ్ చేయబడుతుంది. అప్పుడు ఓ స్వర్గవాసులారా! స్వర్గ జీవితం మీ కొరకు శాశ్వతమైనది. మీకిక మరణమన్నదే లేదు అని చెప్పబడుతుంది. అలాగే, ఓ నరకవాసులారా! నరకయాతన మీకు శాశ్వతంగా ఉంటుంది. మీకు చావు అన్నదే రాదు అని అనబడుతుంది.

(సహి బుఖారి మర్యమ్ సూరా వ్యాఖ్యానం & ముస్లిం కితాబుల్‌జన్నహ్)

మరో హదీసులో ఇలా చెప్పబడింది.

ఓ స్వర్గవాసులారా! ఆరోగ్యం, బలం మీ సొత్తు అయ్యాయి. మీకిక అనారోగ్యం, అస్వస్థ అన్నదే ఉండదు. మీ జీవితం కలకాలం వర్ధిల్లుతుంది. కళకళలాడుతూ ఉంటుంది. మీకు మరణం లేదు మీ వరాలు కరిగిపోనివి, తరిగిపోనివి మీరు నిత్యం యౌవనంలో ఉంటారు. వృద్ధాప్యం అనేది మీ ఛాయలకు కూడా రాదు.

(బుఖారి, కితాబుర్రిఖాఖ్, ముస్లిం, కితాబ్ మజ్‌కూర్)

*నిస్సందేహంగా దైవభక్తి గలవారు ఉద్యానవనాల, సెలయేరుల మధ్యన ఉంటారు. ప్రశాంతగా, నిశ్చింతగా స్వర్గంలో ప్రవేశించండి (అని వారితో అనబడుతుంది) వారి హృదయాలలో ఏకాస్త కోపం, ద్వేషం మిగిలిఉన్నా దాన్ని మేము తొలగిస్తాము. వారంతా అన్నదమ్ములై ఎదురెదురుగా అసనాలపై కూర్చుని ఉంటారు. అక్కడ వారికి ఏ బాధా అంటుకోదు. అక్కణ్ణుంచి వారిని ఎన్నటికిని వెళ్ళగొట్టడం కూడ జరగదు.*

(ఖుర్‌ఆన్ 15వ సూర, అల్ హిజ్ర్ 45-48వ వాక్యములు)

 నమాజును స్థాపించేవారు, సహనం వహించువారు స్వర్గానికి వెళతారు.

వ్యాఖ్యానం : ఈ వచనములో స్వర్గవాసుల గురించి ప్రస్తావించటం జరిగింది. స్వర్గం పట్ల ప్రజలలో ఆశక్తిని, ఆశను కలిగించటం దీని ఉద్దేశ్యం. దైవభక్తిపరులు (ముత్తఖీన్) అంటే షిర్క్ (విగ్రహారాధన) పనులకు దూరంగా ఉండే ఏకదైవారధకులు వారు ఏ పనైనా చేసేముందు ఈ పని అల్లాహ్ మరియు అంతిమ మార్గ దర్శకుడు, ముహమ్మద్ (స) సల్లం యొక్క ఆజ్ఞలను అణుగుణంగా ఉందా? లేదా? అని ఆలోచిస్తూ తన జీవితం గడిపిన వాడినే ముత్తఖీన్ కోవకు చెందుతారు అని చెప్పబడింది.

స్వర్గంలో అన్ని రకాల విపత్తుల నుండి నిశ్చింతగా అన్ని రకాల భయాదోంళనల నుండి నిర్భయంగా ఉంటారు. అలానే ప్రపంచంలో వీరి మధ్య ఉండే అసూయ, ఓర్వలేనితనం, కినుక వంటి భావాలు వారి ఆంతర్యాల నుంచి మెుత్తంగా తీసివేయబడతాయి. ఒకరి పట్ల ఒకరి హృదయాలు నిర్మలంగా అద్దంలా ఉండేటట్లు చేసి ఆపైన స్వర్గంలోకి ప్రవేశం కల్పించటం జరుగుతుంది.

*మరెవరు విశ్వసించి మంచి పనులు చేశారో ఏ వ్యక్తిపై కూడా మేము శక్తికి మించిన భారం వేయము. యదార్థానికి వారే స్వర్గవాసులు. అందులో వారు కలకాలం ఉంటారు. వారి ఆంతర్యాల్లో ఏకాస్తయినా విద్వేషం ఉంటే దాన్ని మేము తొలగిస్తాము. వారి (నివాసాల) క్రింద నుంచి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి....*

(ఖుర్ఆన్ 7వ సూర, అల్ ఆరాఫ్ 42-43వ వాక్యం)

వ్యాఖ్యానం : విశ్వాసం (ఈమాన్) మరియు సదాచరణలు (అమలు స్వాలెహ్) అనేవి మనిషి శక్తికి మించినవి ఎంత మాత్రం కావు. ఒక మనిషి ఎంత భారాన్ని మోయగలుగుతాడో మరే ఆచరణలను ఏ ఇబ్బందీలేకుండా చేయగలుగుతాడో అతన్ని పుట్టించిన ఆ దైవానికి బాగా తెలుసు. వాస్తవమేమిటంటే అల్లాహ్ విధించిన విధులను మనిషి అలవోకగా నెరవేర్చగలుగుతాడు.

మనిషి కోసం అల్లాహ్ సమ్మతించి ఆమోదించిన జీవన విధానం (ఇస్లాం) సర్వకాల సర్వావస్థల్లో ఆచరణకు యోగ్యమైనది.

అంతర్యాల్లో తిష్ఠవేసి ఉన్న కొద్దిపాటి వ్యతిరేకభావం కల్మషం కుళ్ళుమోతుతనం కూడా స్వర్గవాసులకు శోభించదు. ఎందుకంటే దాని మూలంగా స్వర్గవాసులలో పరస్పరం విరోధభావం, ఓర్వలేనితనం వంటివి జనించవచ్చు. అందుకే అల్లాహ్ దానిని సయితం దూరంచేసి స్వర్గవాసులపై ప్రత్యేకంగా దయదలిచాడు. ఫలితంగా వారి హృదయాలు నిష్కల్మషంగా - అద్దం వలె ఉంటాయి. వారి మనస్సుల్లో తోటి స్వర్గవాసి పట్ల వైరభావం కొంచమైన ఉండదు.

*కాని పశ్చాత్తాపం చెంది, విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు (మాత్రం నష్టపోరు) వారు స్వర్గంలో ప్రవేశిస్తారు వారికి రవ్వంత కూడా అన్యాయం జరుగదు.*

(ఖుర్ఆన్ 19వ సూర మర్యమ్ 60వ వాక్యం)

*అక్కడ వారు 'సలామ్' తప్ప వ్యర్థమైన మాటలేవి వినరు. వారికోసం అక్కడ ఉదయం సాయంత్రం వారి ఆహారం సమకూరుతూ ఉంటుంది. మేము మా దాసులలో భయభక్తులు కలిగి ఉండేవారిని వారసులుగా చేసిన స్వర్గం ఇదే.*

(ఖుర్ఆన్ 19వ సూర మర్యమ్ 62-63వ వాక్యం)

వ్యాఖ్యానం : మనో వాంఛలకు బానిసలై, నమాజుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారు తమ తప్పను తెలుసుకొని దైవ సన్నిధిలో క్షమాపణ వేడుకుంటే, ఇక మీదట సత్కార్యాలు చేస్తూ ఉంటే అలాంటి వారు క్షమింపబడతారు. వారు స్వర్గానికి అర్హులవుతారు.

స్వర్గంలో ఎటుచూసినా దైవదూతలు వారికి 'సలాం' చేస్తూ ఉంటారు. స్వర్గవాసులు కూడా ఒకరినొకరు సలాం చేసుకుంటూం టారు.

.... ఏ వ్యక్తి అయితే శుభ్రంగా (సున్నత్ పద్ధతిలో) వజూ చేసిన తరువాత ఈ దు"ఆ" (అష్హదు అల్ లా ఇలాహ ఇల్లాల్లాహు వ అష్హదుఅన్న అబ్దుహు వరసూలహు) చదివినట్లు అయితే ఆ వ్యక్తి కొరకు స్వర్గంలోని ఎనిమిది ద్వారాలు తెరవబడతాయి. ఏ ద్వారం గుండానైనా ప్రవేశించగలడు.

(ముస్లిం 1, కితాబుత్ త్తహరత్ 373వ పేజి)

పై హదీసును బట్టి స్వర్గానికి ఎనిమిది ద్వారాలు ఉంటాయని తెలుస్తుంది. వజూ చేసినప్పుడు చాలామంది నిర్లక్ష్యంగా చేస్తూ ఉంటారు. అలా నిర్లక్ష్యంగా ఉండటం వలన ఎంతోమంచి అవకాశాన్ని జారవిడుచుకుంటున్నారు. ఇక నమాజులు చదవని వారి పరిస్థితి ఏమిటి? ఇక నుండైనా అల్లాహ్ సుబ్హానహుతఆలాతో క్షమాపణ వేడుకొని అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసముంచి ఐదు పూటల నమాజును స్థాపించి, సత్కార్యాలు చేయవలెను. ఇదే సాఫల్య భాగ్యం. అల్లాహ్ మనందరికి ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకునే శక్తి ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

హారిషా (రజి) వారి తల్లి ముహమ్మద్ (సల్లం) వారి వద్ద వచ్చి (హరిషా (రజి) బదర్ యుద్ధంలో వీర స్వర్గాన్ని పొందారు. ఇలా అంది ఓ మహా ప్రవక్త మీకు తెలుసు నేను హారిషా (రజి) ఎంతో ప్రేమించేదానినో నా కుమారుడు స్వర్గానికి వెళ్ళినట్లు అయితే స్వర్గంలో ప్రవేశించినట్లు అయితే నేను వాడికోసం అస్సలు ఏడ్వను దుఃఖించను అలాకాక పోయినట్లు అయితే నేను ఎదుట ఏవి చేసుకుంటానా మీరే చూస్తారు అన్నది ఆ మాటలు విని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు నీ కుమారుడు స్వర్గంలో ఎంతో ఉన్నత స్థానాన్ని పొందాడు జన్నతుల్ ఫిర్దౌస్ అనే గొప్ప స్థానంలో ఉన్నాడు అని అన్నారు. (బుఖారి, కితాబుల్ రిఖాఖ్)

మహో ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఇలా వివరించారు. స్వర్గంలో ఓ వృక్షం ఉంది. దాని నీడలో ఒక రౌతు 100 సంవత్సరములు ప్రయాణం చేసినా దాన్ని దాటలేడు.
(బుఖారి 4కితాబుల్ రిఖాఖ్ పేజి 584 & బుఖారి 6వ పేజి 423)

అబుహురైరా (రజి) వారు ఇలా ఉల్లేఖించారు. మహోప్రవక్త (సల్లం) వారు ఇలా తెలిపిరి. స్వర్గంలోని ప్రతి వృక్షం యొక్క మొదలు బంగారముదై ఉంటుంది. (ముస్లిం కితాబుల్ తౌబ)

అనస్ బిన్ మాలిక్ (రజి) వారు ఇలా వివరించారు. నిశ్చయంగా స్వర్గంలో ఓ బజారు ఉంటుంది. అక్కడికి ప్రతి శుక్రవారం స్వర్గవాసులు వస్తారు. అక్కడికి వారు వచ్చినప్పుడు వారి ముఖాలు దుస్తులు చక్కటి సువాసన వెదజల్లుతూ ఉంటుంది. దీనివలన వారి అందం మరింత రెట్టింపు అవుతుంది. వారు తిరిగి వారి ఇంటివారి వద్దకు వెళ్ళినప్పుడు వారి అందం రెట్టింపు అవడాన్ని వారి ఇంటి వారు గుర్తించి అల్లాహ్ సాక్షి మీ అందం రెట్టింపు అయ్యింది అంటారు. వీరు కూడా అలానే అంటారు. మీ అందం కూడా రెట్టింపు అయ్యింది అని.
(ముస్లిం, కితాబుల్ జన్నహ్)

అనస్ (రజి) వారు ఇలా వివరించారు. మహోప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఇలా తెలియజేశారు. ఒకసారి నేను స్వర్గంలో నడుస్తుండగా నాకు సరస్సు కనిపించింది. దానికి ఇరుప్రక్కల ముత్యాలు గుట్టలుగుట్టలుగా ఉన్నాయి. నేను జిబ్రయిల్ (అలై) వారిని ఇది ఏమిటని ప్రశ్నించగా ఆయన ఇది కౌసర్ దీనిని అల్లాహ్ మీకు సమర్పించాడు కౌసర్ సరస్సు యొక్క మట్టి యొక్క సువాసన ఎంతో అమోఘంగా ఉంది.
(బుఖారి, కితాబుల్ హౌజ్)

 మంది విచారణ లేకుండా స్వర్గంలో చేరతారు. మంత్రతంత్రాలు చేయరు / అపశకునాలు చూడరు/అగ్గితో వైద్యం చేయరు.

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఇలా తెలిపారు. స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించేటప్పడు వారికి ముఖముపైగాని దేహముపైగాని ఎక్కడ రోమాలు (వెంట్రుకలు) ఉండవు. తలపై ఉంగరాల జుట్టు ఉంటుంది. సిగ్గులొలికే కళ్ళు ఉంటాయి. వారి వయస్సు 30 నుండి 33 సం॥ మధ్య వయస్సు కలవారై ఉంటారు.

(బుఖారి, ముస్లిం, కితాబుల్ఈమాన్)

అబుహురైరా (రజి) వారు ఇలా తెలిపారు. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఇలా వివరించారు. స్వర్గంలో ప్రవేశించినప్పడు దేహముపై వెంట్రుకలు ఉండవు. గెడ్డముగాని, మీసముగాని ఉండదు. తలవెంట్రుకలు గింగిరాలు తిరిగిన ఉంగరాల జుట్టు ఉంటుంది. సిగ్గులొలికే కళ్ళతో ఆదం (అలై) వలె అరవై గజాల పొడవు ఏడు గజాల వెడల్పు కలిగి ఉంటారు.

(సహిజామియ అస్ సగీర్ రఖిముల్ హదీస్ 7928)

అబుహురైరా (రజి) వారు ఇలా ఉల్లేఖించారు. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఇలా తెలిపారు. (స్వర్గవాసులకు) చాటింపు వేసేవాడు ఇలా తెలియజేస్తున్నాడు. మీకు గొప్ప వరములు ఇవ్వబడ్డాయి. మీరు ఇక్కడ ఎల్లప్పడు ఆరోగ్యంగా ఉంటారు. ఏనాడు మీరు అనారోగ్యానికి గురికారు. మీరు శాశ్వతంగా జీవించి ఉంటారు. మీకు మరణమనేదే ఉండదు. మీరు సదా యౌవ్వనంతో ఉంటారు. మీరు ముసలివారేకారు మీలో ముసలితనమే రాదు. మీకు ఇచ్చే వరాలు ఎన్నటికి తగిరిపోవు అవి శాశ్వతంగా ఉంటాయి.

(ముస్లిం, కితాబుల్ జన్నత్)

ప్రవక్త (స) ఇలా తెలిపిరి, నేను స్వర్గంలో ఎక్కువమంది బీదసాదలను చూసాను. నేను నరకంలో అత్యధికంగా స్త్రీలను చూసాను. (బుఖారి 4 పేజి 579)

స్వర్గవాసుల యొక్క గుడారం (ఖేమా) ఒక ముత్యం. దాని ఎత్తు 30 మైలు వరకు గలదు. దాని ప్రతీ ఒడ్డున ఒక స్త్రీ ఉ ంటుంది. ఇతరులెవ్వరూ చూడజాలరు. (బుఖారి 4 పేజి 580)

అబుసయిద్ ఖుద్‌రి (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త (స) వారు ఇట్లనిరి. స్వర్గవాసులు వారి కన్నా ఎత్తైన భవంతి వారిని ఈవిధంగా చూస్తారు. ఏవిధంగానైతే శుభోదయ సమయంలో ఉత్తర, దక్షిణ దిశలు మెరిసే నక్షత్రాలను చూస్తామో ఆవిధంగా, అనుచరులు అడిగారు. ఓ ప్రవక్త ఆ స్థానాలు ప్రవక్తలకు లభిస్తుంది కదా? అందుకు ప్రవక్త (స) "ఎందుకు చేరుకోలేరు! అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. అల్లాహ్‌ను విశ్వసించి, దైవప్రక్తలను అనుసరిం చిన వారిదై ఉంటాయి. (బుఖారి 4వ పేజి, 585)

అబుహురై (ర) ఉల్లేఖనం ప్రవక్త (స) ఇలా తెలిపిరి.

స్వర్గంలో ప్రవేశించె మొదట సమూహం వారి యొక్క ముఖంలో పున్నమి చంద్ర బింబంలా మెరుస్తాయి. ఉమ్మి వేయుట గాని, చీముడు రావడం గాని, మల మూత్రం రావటం గాని జరగదు. వారి కంచాలు దువ్వెనలు, వెండిదై ఉంటాయి. వారి దూపాలు (ఉద్) సాబ్రానివై ఉంటాయి. వారి చెమట కస్తూరి సువాసనగల్గి ఉంటుంది. ప్రతీ వ్యక్తికి ఇద్దరు భార్యలుంటారు. వారి కాళ్ళ పిక్కలగల కండలు కనిపిస్తాయి. వారిలో నొకరినొకరులో బేదాభిప్రాయాలుండవు. వారి మనసులు ఒకటై ఉంటాయి. ఉదయం, సాయంత్రం అల్లాహ్ స్మరణలో లీనమై ఉంటారు.

(బుఖారి 4 పేజి 581)

మహా ప్రవక్త (స) ఇలా అన్నారు : ఎవరైతే ఉదయం / రాత్రి ఈ "దుఆ" చదివి చనిపోతారో వారు స్వర్గవాసి.

 ఒక ముస్లింనకు మంచివాడని, 4/3/2 సాక్ష్యమిస్తే స్వర్గంలో ప్రవేశిస్తాడు.

అల్లాహుమ్మ అన్‌త రబ్బీలా ఇలాహ ఇల్లా అన్‌త ఖలఖ్‌తని వ అనబ్‌దుక, వఅన అలా అహ్‌దిక వవాదిక మస్తతాతు, అవుజు బిక మిన్ షర్రి మా సనాతు అబూవులక బినామతిక అలయ్యా, వ అబూఉ బిజమ్‌బీ ఫగ్‌ఫిర్‌లి ఫఇన్నహూలా యగ్ ఫిరుజ్జు నూబ ఇల్లా అన్‌త.

అర్థం : "ఓ అల్లాహ్! నీవే నా పరిపాలకుడువు. నీవు తప్ప ఆరాధ్య దైవం ఎవ్వరూ లేడు. నీవు నన్ను పుట్టించావు నేను నీ దాసుడనై. నీ ఆజ్ఞలపై సాధ్యమైనంతవరకు ఆచరిస్తున్నాను. నా వల్ల జరిగిన చెడుల నుండి శరణువేడుచున్నాను. నీ అనుగ్రహంను అంగీకరిస్తున్నాను. నా వల్ల జరిగిన పాపాలను ఒప్పకొనుచున్నాను. నన్ను క్షమించు, నా తప్ప క్షమించువాడవు నీవే. (బుఖారి 8/324)

అల్లాహపై విశ్వాసముంచి సత్కర్మాలు చేస్తూ ఎల్లవేళల అల్లాహ్‌కు భయపడుతూ జీవనం సాగించేవారి కోసమే స్వర్గాన్ని ముస్తాబుచేసి ఉంచాడని ఖుర్‌ఆన్ వచనముల ద్వారా మహా ప్రవక్త (స) ప్రవచనములు ద్వారా తెలుసుకున్న సహబీలు ఎంత ఉత్సాహముతో ఆచరించేవారో సహబీల యొక్క జీవన విధానమును బట్టి అర్ధము అవుతుంది. ఇప్పడు మనము కొందరు సహబీల యొక్క కొన్ని జీవన ఘట్టాలను తెలుసుకుందాము.

ఖుర్‌ఆన్ వచనానికి స్పందించిన అబూతలహ (రజి) వారు.

అనస్‌బిన్ మాలిక్ (రజి) వారు ఇలా ఉల్లేఖించారు. మదీనాలోని మొత్తం అన్‌సారిలలోకి అబూతలహ (రజి) వారు ధనవంతులు ఆయన ఉన్న తోటలలో మస్జిదేనబవి ఎదురుగా ఉన్న బిరిహ అనుతోట అంటే ఆయనకు ఎంతో ప్రియమైనది ఎందుకంటే మహాప్రవక్త (సల్లం) ఆ తోటలోకి వస్తూ ఉండేవారు. ఆ తోటలోని బావిలో నీళ్ళు చాలా చల్లగా రుచిగా ఉండేవి. మహా ప్రవక్త (స) వారు ఆ బావిలో నీళ్లను ఎంతో ఇష్టంగా సేవించేవారు.

ఒకరోజు ఖుర్ఆన్‌లోని సూర ఆలిఇమ్రాన్ 92వ వచనము అవతరించింది. దాని అర్థం : "మీకు ప్రియాతి ప్రియమైన వస్తువుల నుండి మీరు (దైవ మార్గములో) ఖర్చు పెట్టనంతవరకూ మీరు పుణ్యస్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు పెట్టేదంతా అల్లాహ్‌కు తెలుసు." ఈ వచనము అవతరించిన తరువాత మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారి వద్దకు వచ్చి అల్లాహ్ తాలా ఆజ్ఞాపించినట్లు నాకు అత్యంత ప్రియమైన ఆస్థిని బిరిహా తోటను అల్లాహ్ మార్గములో సదఖా ఇచ్చెయ్యాలనుకుంటున్నాను ఇప్పడు మీ ఇష్టం ఓ ప్రవక్తా (సల్లం) దాన్ని మీరు ఎలా అయిన ఖర్చు పెట్టండి అన్నారు అది విని మహా ప్రవక్త (సల్లం) వారు చాలా సంతోషించారు. వహ వహ చాలా చక్కటి ఆలోచనా అబుతలహ (రజి) నీవు ఇలా చెయ్యి ఈ తోటను నీ బంధువులకు పంచిపెట్టు మరియు నీ సోదరులకు ఇవ్వు అన్నారు. అబుతలహా (రజి) వారు అలానే చేసారు. (బుఖారి / ముస్లిం)

మరో సహాబీ గురించి తెలుసుకుందాం

మదీనాలో ఓ అన్‌సారి సహాబీ (రజి) మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఈరోజు అల్లాహ్ మార్గములో యుద్ధం చేసి మరణించినవారు స్వర్గంలో తప్పక ప్రవేశిస్తారు అన్న మాటలను విన్న అన్‌సారి సహాబీ (రజి) అతడు ఆ సమయంలో ఖర్జూరం పండ్లు తింటు. మహా ప్రవక్త వారి మాటలను వింటున్నాడు. తన చేతిలో ఉన్న ఖర్జూరపు పళ్ళు వైపు చూసాడు. ఇవి చాలా ఉన్నాయి. తినడానికి చాలా సమయం పడుతుంది స్వర్గానికి వెళ్ళేందుకు ఎందుకు ఆలస్యం చెయ్యాలి అనుకున్నాడు. వెంటనే తన చేతిలో ఉన్న ఖర్జూరపు పళ్ళను పక్కనపెట్టి యుద్ధభూమిలోనికి దూసుకు వెళ్ళి అక్కడ వీర మరణం పొంది జన్నతుల్ ఫిరదౌస్‌లో స్థానం పొందాడు. ఆ వ్యక్తి పేరు ఉమర్‌బిన్ హుమామ్ (రజి) (అర్రహీతుల్‌ముఖ్‌తూమ్ 339)


...లు నమాజ్ సలుపుతూ, ఉపవాసాలు పాటిస్తూ మర్మాంగములను పరిరక్షిస్తూ, భర్తకు విధేయురాలైన స్త్రీ స్వర్గంలో ప్రవేశిస్తుంది.

మరొక సహాబీ త్యాగం గురించి తెలుసుకుందాము.

హాఫీజ్ ఇబ్నె కసీర్ (రహ) మరియు ఇబ్నె షాకిర్ (రహ) వారు అబ్దుల్లా బిన్ హుజైఫా (రజి) వారి గురించి ఇలా తెలియజేశారు.

హజరత్ హుజైఫా (రజి) వారు అవిశ్వాసులైన రోము సైన్యానికి బందీలుగా పట్టుబడిపోయారు. ఆ సైనికులు ఈయనను వారి రాజువద్ద హాజరుపరిచారు. అంతట ఆరాజు హుజైఫా (రజి) వారితో నీవు క్రైస్తవ మతము స్వీకరించి క్రైస్తవునిగా మారినట్లు అయితే నీకు నా సామ్రాజ్యములో భాగస్వామిగా చేస్తాను. అంతేకాదు నా కుమార్తెతో నీ వివాహం జరిపిస్తాను. నిన్ను నా అల్లుడిగా చేసుకుంటాను అన్నాడు. అప్పుడు హుజైఫా (రజి) వారు ఇలా అన్నారు "నీ రాజ్యం మొత్తం నాకు ఇచ్చిన మొత్తం అరబ్బు ప్రాంతానికి నన్ను అధిపతిని చేసిన రెప్పపాటు కాలం పాటు నేను ఇస్లాం ధర్మాన్ని వీడేది లేదు" అన్నారు. అంతట రాజు కోపంతో ఊగిపోతూ నీకు మరణశిక్ష వేస్తాను అన్నాడు. అవును ఆ అధికారం నీకు ఉంది. అలా కానియ్యి అన్నారు. హుజైఫా (రజి) వారు దుష్టుడైన రాజు సైనికుల వైపు చూసి ఈతడ్ని తీసుకువెళ్ళి శిలువపై ఎక్కించి మేకులు కొట్టండి. ఒక్క ఒక్క మేకు కొడుతూ అతని మనస్సు మారిందో లేదో కనుక్కోండి అని ఆజ్ఞాపించాడు. సైనికులు హుజైఫా (రజి) వారిని శిలువపై ఎక్కించి మేకులు కొడుతూ ఇకనైనా క్రైస్తవ మతాన్ని అంగీకరించు బ్రతికిపోతావు అనేవారు బాధను భరిస్తూ ఇది ఎట్టి పరిస్థితులలో జరగేది కాదు అంటూనే ఉన్నారు. ఇదంతా గమనిస్తున్న రాజు ఈతగాడికి ఇలా కాదు అతడ్ని క్రిందకు దించండి అన్నాడు. ఓ పెద్ద రాగి పాత్రను తెండి దాన్ని నిప్పల మీద వేడి చెయ్యండి అన్నాడు. ఆ రాగి పాత్ర విపరీతమైన వేడెక్కిన తరువాత హుజైఫా (రజి) వారు ఎదుట ఓ ముస్లిం ఖైదీని

తీసుకువచ్చి ఆ వేడెక్కిన రాగి పాత్రలోకి తోసేసారు. ఇలా పడీ పడిన వెంటనే అతని చర్మం కరిగిపోయింది. మాంసం ముద్దలు ముద్దలుగా శరీరం నుండి కరిగి జారిపడసాగాయి. ఒక్క క్షణంలోనే ఎముకల గూడులా మారిపోయాడు. ఈ దృశ్యాన్ని చూసి హుజైఫా (రజి) వారు చలించిపోయారు. ఆ దుష్టుడైన రాజు హుజైఫా (రజి) వైపు చూస్తూ నీకు ఇదే గతి పడుతుంది. మంచిగా నేను చెప్పినట్లు క్రైస్తవ మతాన్ని స్వీకరించు అన్నాడు. ఓ రాజా నన్ను ఏమి చేసినా నేను ఇస్లాం ధర్మాన్ని వదిలేది లేదు అని హుజైఫా (రజి) వారు కరాఖండిగా చెప్పేశారు. రాజు ఆజ్ఞతో హుజైఫా (రజి) వారిని వేడిచేసిన రాగి పాత్రలోనికి తోసెయ్యటానికి సైనికులు సిద్ధమయ్యారు. అదే సమయం హుజైఫా (రజి) వారు కంటతడి పెట్టుకోవటాన్ని రాజు గమనించి వెంటనే ఆయన క్రిందకు దించండి ఆయన మనస్సు మారినట్లుంది అన్నాడు. ఆ రాజు హుజైఫా (రజి) దగ్గరకు పిలిచి నీ మనస్సు మారిందా కంటతటి పెట్టుకుంటున్నావు అయితే నా సామ్రాజ్యంలో అధికారాన్ని పొందు, నా ధర్మాని స్వీకరించు. నా అల్లుడివి అయిపో అన్నాడు అంతట హుజైఫా (రజి) ఓ రాజా నేను ప్రాణ భీతితో బాధపడలేదు. అల్లాహ్ నాకు ఒక్క ప్రాణమే ఇచ్చాడు. దీన్ని అల్లాహ్ మార్గంలో అర్పించుకుంటున్నాను. అదే నాకు అల్లాహ్ నా శరీరంలో ఉన్న రోమాలకు బదులుగా ఒక్క ఒక్క ప్రాణం యిచ్చి అన్ని మార్లు ఈ రాగి పాత్రలో పడి ప్రాణం పోగొట్టుకోలేక పోతున్నానే అని బాధపడుతున్నాను అన్నారు. ఈ మాటలు విని రాజు విసిగిపోయి ఈతడ్ని తీసుకువెళ్లి చెరసాలలో బంధించండి. అని ఆజ్ఞాపించాడు. చాలా రోజుల పాటు రాజు హుజైఫా (రజి) వారికి అన్నపానీయాలు ఇవ్వకుండా హింసించాడు. అలా ఆకలి బాధతో ఉన్న సమయంలో హుజైఫా (రజి) వారి వద్దకు పంది మాంసాన్ని సారాయి పంపాడు.

హుజైఫా (రజి) వారు వాటిని ముట్టుకోలేదు. ఈ విషయం తెలిసి రాజు తన దగ్గరకు పిలిపించి నీవు నేను పంపిన భోజనాన్ని ఎందుకు తినలేదు. "ఓ రాజా ఇలాంటి సమయంలో నీవు పంపిన భోజనాన్ని తినటంతో నా ప్రాణాన్ని కాపాడుకోవడం నాకు ధర్మ సమ్మతమే అయినా నేను ఎందుకు తిన లేదు అంటే అది నా చేత తినిపించి నీవు తృప్తి పడాలనుకుంటున్నావు. ఇలా ఎన్నటికి జరగనివ్వను. నేను ఆకలితో చావనైనా చస్తాను గాని ఒక్క క్షణం పాటు కూడా నా చేత ఇలాంటి పనులు చేయించి నీవు తృప్తి చెందటం అంటే నేను సహించలేను. నీకు అలాంటి అవకాశం ఇవ్వను. చివరికి రాజు ఇలా అన్నాడు. నీవు నా నొసలుపై ముద్దుపెట్టు నిన్ను, నీ వాళ్ళను విడిచి పెడతాను అన్నాడు. దానికి హుజైఫా (రజి) వారు అంగీకరించి రాజు యొక్క నొసలుపై ముద్దుపెట్టారు. రాజు కూడా తన వాగ్ధానాన్ని నెరవేర్చాడు. అక్కడ నుండి విముక్తి పొంది హుజైఫా (రజి) వారు ఉమర్ (రజి) వారి వద్దకు వచ్చి కలుసుకున్నారు. ఉమర్ (రజి) వారు హుజైఫా (రజి) వారిని ఎంతో సాదరంగా తన దగ్గరకు తీసుకొని మెంబరే రసూల్‌పై కూర్చోబెట్టి అక్కడ జరిగినది వివరించమన్నారు. హుజైఫా (రజి) వారు అక్కడ జరిగిన విషయాలు చెబుతుంటే ఉమర్ (రజి) వారు వింటు ఏడ్వసాగారు. అలా ఏడుస్తూ ఉండటం వలన ఉమర్ (రజి) వారి గడ్డం మొత్తం కన్నీటితో తడచి ముద్ద అయ్యింది. ఆ తరువాత ఉమర్ (రజి) వారు ముస్లింలను ఉద్దేశించి ఇలా అన్నారు "మీరంతా హుజైఫా (రజి) వారి నొసలుపై ముద్దుపెట్టండి. ఇది మన బాధ్యత అని తన హుజైఫా గారిని కౌగలించుకుని ముద్దు పెట్టుకున్నారు. (ఇబ్నెకసీర్)

మరో వృత్తాంతం :

అతాబిన్ రబాహ్ (రజి) వారు ఈ హదీసును ఉల్లేఖించారు.

నాతో ఇబ్నే అబ్బాస్ (రజి) వారు ఇల్లా అన్నారు. ఓ రబాహో నీకు ఓ స్వర్గవాసిని చూపనా? తప్పకుండా చూపండి అన్నాను. నేను అదిగో ఆ నల్లగా ఉన్న స్త్రీని చూసావా ఆమే స్వర్గవాసి. ఈమె మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి వద్దకు వచ్చి నాకు మూర్ఛరోగం వుంది. మూర్ఛవచ్చినప్పుడు నా వంటిపై ఉన్న వస్త్రాలు కూడా ఊడిపోతాయి. నా ఈ రోగం నయం అయ్యేలా దు "ఆ" చెయ్యండి ఓ మహా ప్రవక్తా (స) అని విన్నవించుకుంది. మహా ప్రవక్త ముహమ్మద్ (స) ఆమెతో ఇలా అన్నారు నీవు సహనం వహించినట్లు అయితే ఈ కష్టానికి బదులుగా అల్లాహ్ నీకు స్వర్గాన్ని ప్రసాదిస్తాడు. అలా కాదు నీకు ఈ రోగం నుండి విముక్తి కావాలనుకుంటే దు"ఆ" చేయమంటే అలానే చేస్తాను అన్నారు. అందుకు ఆమే నేను సహనం వహిస్తాను. కాని మూర్ఛవచ్చేటప్పుడు నా వస్త్రములు ఊడిపోకుండా ఉండేలా దు"ఆ" చెయ్యండి అన్నది ఆ స్త్రీ. (బుఖారి / ముస్లిం)

(స్వర్గం పొందాలన్న ఆకాంక్ష ఆమే మూర్ఛరోగాన్ని సహించేటందుకు సిద్దపడింది)

మరో సంఘటన చూడండి :

ఓసారి మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి వద్దకు ఓ వ్యక్తి వచ్చి ఓ మహా ప్రవక్తా! నాకు చాలా ఆకలిగా ఉంది. నాకు తినడానికి ఏమైనా ఉంటే పెట్టండి అన్నాడు. మహాప్రవక్త (స) వారు తమ ఇంటికి ఓ మనిషిని పంపి ఏమైనా తినడానికి ఉంటే తీసుకురమ్మని పంపారు. కాసేపటికి ఆ వ్యక్తి తిరిగివచ్చి తమరి ఇళ్ళలో ఎక్కడా త్రాగటానికి నీళ్ళు తప్ప మరేమిలేవని చెప్పాడు. అప్పడు మహా ప్రవక్త (స) వారు అక్కడ ఉన్న వారితో మీలో ఎవరైనా ఈయనను ఈరోజు రాత్రి అతిథిగా తీసుకువెళతారా అని అన్నారు. అక్కడే ఉన్న అబూ తలహా అన్సారి (రజి) వారు మహా ప్రవక్తా నేను అతనిని అతిథిగా తీసుకుంటాను అని చెప్పి

 నంలో ఎక్కువ ఆరాధనలో గడిపే వ్యక్తి, ఎక్కువ సమయం మస్జిద్‌లో గడిపే వ్యక్తి స్వర్గంలోకి వెళతాడు.

తన ఇంటికి తీసుకువెళ్ళారు. అతిథి కూర్చోబెట్టి భార్యతో ఈయన మహాప్రవక్త (స) వారి అతిథి ఈరోజు మనము తినకపోయినా పర్వాలేదు. ఈయనకు ఎలాంటిలోటు రానివ్వరాదు అన్నారు. ఈరోజు పిల్లలకోసం ఉంచిన రొట్టెముక్కలు కొంత త్రాగేటందుకు నీరు తప్ప మరేమీ లేదు. అయితే సరే నీవు పిల్లలకు ఏవైనా కథలు చెప్పి పడుకోబెట్టు మనం ఇద్దరం ఈ పూటకు పస్తు ఉందాం. ఈ విషయం మన అతిథి గుర్తించ కుండా జాగ్రత్తపడాలి అన్నారు అబూ తలహా (రజి) తన భార్యతో మేము భోజనానికి కూర్చునప్పుడు నీవు దీపాన్ని ఆరిపోయేలా చెయ్యి. తరువాత చీకటిలోనే మన వద్ద ఉన్న రొట్టెలను అతిథికి వడ్డించు నేను ఖాళీ పాత్ర ముందు ఉంచుకొని రొట్టెలు తింటున్నట్లు నటిస్తాను ఇలా భార్యభర్తలు ఇద్దరు అనుకొని అలానే అతిథికి ఎలాంటి అనుమానం రాకుండా వాళ్ళు ఏమి తినకుండా వాళ్ళ కడుపు మాడ్చుకొని అతిథి కడుపు నింపారు. ఉదయం అబు తలహా (రజి) వారు మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారి వద్దకు వచ్చినప్పుడు ఈతడు రాత్రి చేసిన పుణ్యకార్యానికి అల్లాహ్ ఎంతో సంతోషించాడు అన్నారు.

(బుఖారి)

మరో సహాబీ ఆచరణ. చూడండి ఇహలోకంలోనే మహాప్రవక్త (సల్లం) వారు ఈతడు స్వర్గవాసి అని అన్నారు.

అనస్ (రజి) వారు ఇలా తెలియజేశారు. మేమంతా మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి వద్ద కూర్చుని ఉన్నాము. మాతో ప్రవక్తా (స) వారు మీ వద్దకు ఇప్పుడు ఓ స్వర్గవాసి రానున్నాడు అన్నారు. ఇంతలో అక్కడకు సఈద్ బిన్ ఉబి వఖ్ఖాస్ (రజి) వారు వచ్చారు. మరుసటి రోజు కూడా అలానే అన్నారు. అదే సమయానికి సఈద్ (రజి) గారే వచ్చారు అలానే మూడో రోజు మీ వద్దకు ఇప్పుడు ఓ స్వర్గవాసిరానున్నాడు అన్నారు. అదే సమయంలో సఈద్ (రజి) వారే వచ్చారు. అక్కడ ఉన్నవారిలో అబ్దుల్లా బిన్ ఉమర్

బిన్ ఆస్ (రజి) వారు కూడా ఉన్నారు. ఆయనకు ఒక ఆలోచన వచ్చింది. సఈద్ (రజి) వారు చేస్తున్నది ఏమిటి అన్నది తెలుసుకొని తను కూడా అలానే ఆచరించి స్వర్గాన్ని పొందే మార్గాన్ని సులభతరం చేసుకోవాలని భావించి సఈద్ (రజి) వారి వద్దకు వచ్చి తన తండ్రితో తగాదా పడ్డానని మూడురోజుల పాటు మీ ఇంటిలో ఉండేందుకు అనుమతి కోరారు. సఈద్ (రజి) వారు అబ్దుల్లా (రజి) వారికి ఉండేందుకు అనుమతి ఇచ్చారు. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) వారు సఈద్ (రజి) వారిలో ఎలాంటి ప్రత్యేకతలు చూడలేదు. ఆయన రాత్రిపూట తరచూ తహజ్జుద్ చదివే అలవాటు లేదు. మరే ప్రత్యేకమైన విషయాలు ఆయనకు కనిపించలేదు. కాని ఆయన నిద్రలో అటు ఇటు పొర్లినప్పడు సుబహా నల్లాహ్ అల్హమ్దులిల్లాహ్ అన్న జికిర్ తప్ప మరేది ఇతనిలో అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) వారికి కనిపించలేదు. మూడోరోజు సఈద్ (రజి) వారితో తను వచ్చినది ఎందుకో వివరించారు. నాకు మా నాన్న గారికి ఎలాంటి గొడవజరగలేదు. ప్రవక్త (స) మేము కూర్చుని ఉండగా మీరు వచ్చేముందు స్వర్గవాసి రానున్నాడు అన్నప్పడు మూడుసార్లు మీరే వచ్చారు. ఇంత ఘనత మీకు దక్కడానికి మీరు ఆచరించే ఆచరణ ఏమిటా అన్నది తెలుసుకోవాలని మూడురోజులు మీ ఇంటిలో ఉన్నాను. కాని నాకు మీలో స్వర్గాన్ని చేర్చే ఆచరణ ఏమిటో అర్థం కాలేదు అన్నారు. మీరే చెప్పండి మీ ప్రత్యేకత ఏమిటి అన్నారు. అది విని సఈద్ (రజి) నేను చేసే ఆచరణ నీవు మూడు రోజులు చూసావు. ఇవి కాకుండా ఇంకో రెండు ఆచరణలు నేను పాటిస్తూ ఉంటాను. 1. ఏ ముస్లింపై ఎలాంటి కుళ్ళు, కపటం ఉంచుకోను. 2. అల్లాహ్ ఎవరిపైన అయిన అనుగ్రహించి వారికి మేలు జరిగితే నేను అది చూసి ఈర్ష్యపడను అన్నారు. కుళ్ళు, ఈర్ష్య ద్వేషాల నుండి దూరంగా ఉంటాను అన్నారు.

 శారీరక బంధానికి ఆహ్వానిస్తే అల్లాహ్‌కు భయపడి, ఆ పనిని నిరాకరించిన వ్యక్తి స్వర్గానికి వెళతాడు.

అల్లాహ్ మీ కల్మషం లేని మనస్సు గుర్తించే మీకు స్వర్గాన్ని ప్రసాదించాడు అన్న విషయం నాకు అర్థం అయ్యింది అన్నారు. అబ్దుల్లా బిన్ ఉమ్రు (రజి) వారు. (మస్నద్ అహ్మద్)

సహబాలలో ఒక్కొక్కరిది ఒకో ప్రత్యేకత అందరిది ఒక్కటే ఆరాటం. ఒక్కటే ఆశయం. అదే స్వర్గంలో స్థానాన్ని పొందటం. అందుకే వారు ఇహలోక సుఖాలకన్నా పరలోకానికే ప్రాముఖ్యత నిచ్చేవారు.

అబుహురైరా (ర) ఈవిధంగా ఉల్లేఖించారు. జనులు నా గురించి ఇలా అంటుండేవారు. అబూహురైరా (రజి) చాలా హదీసులను ఉల్లేఖిస్తుంటారు. ఆయన ఎల్లవేళలా మహాప్రవక్త (సల్లం) సన్నిధిలోనే గడుపుతారు. కేవలం ఆకలి తీర్చుకోవటానికి మాత్రమే ప్రవక్త వారి నుండి దూరం అవుతారు. తప్ప మిగిలిన సమయం అంతా ఇస్లాం ధర్మ విషయాలను తెలుసుకొనేందుకు సమయాన్ని వెచ్చించేవారు. అబుహురైరా (రజి) వారు ఇలా అన్నారు. నేను ఏనాడూ నూనెలో వేయించిన రొట్టె తినలేదు. చక్కటి వస్త్రాలు వేసుకొనుట ఎరుగను. నా సమయం అంతా ధర్మాజ్ఞానాన్ని సంపాదించడానికే వినియోగించాను. ఒకోసారి ఆకలి బాధ తట్టుకోటానికి కడుపుకి రాయి కట్టుకునేవాడ్ని ఒకోసారి కొందరి వద్ద ఖుర్ఆన్ వచనము చదివి వినిపించేవాడ్ని. ఎందుకంటే నేను చదివే వచనముల యొక్క భావం ఆకలి గొన్నవానికి అన్నంపెట్టమని ఉండేది (మిస్కీన్‌లను ఆదరించండి) అర్థం చేసుకున్న వారు నన్ను తీసుకువెళ్ళి అన్నం పెట్టేవారు. ఇందులో జాఫర్ బిన్ అబుతాలిబ్ (రజి) గారు నన్ను తరచూ తమ ఇంటికి తీసుకువెళ్ళి ఆ సమయంలో తన ఇంటిలో ఉన్నది నాకు పెట్టేవారు. ఒకోసారి కేవలం తేనే ఉండేది. అదే ఆరోజు మాకు భోజనం.

జాఫర్ (రజి) వారు అబుతాలిబ్ యొక్క కుమారుడు అలీ (రజి) వారి సోదరుడు ఈయన అలీ (రజి) వారి కంటే 10 సం॥లు పెద్దవాడు. ఈయనకు జుల్ జనా హైన్ అని బిరుదు ఇవ్వబడింది. జాఫర్ (రజి) ఇస్లాం ఆరంభ దశలోనే ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు. ఈయన మహా ప్రవక్త వారి కుడివైపు నిలుచుని నమాజు చదివేవారు. మహాప్రవక్త (సల్లం) ఈయనతో ఇలా అనేవారు. నీకు అల్లాహ్ రెండు రెక్కలను ప్రసాదిస్తాడు. దానితో నీవు స్వర్గంలో ఎగురుతూ ఉంటావు. జాఫర్ (రజి) వారు తన 41 యేట జంగెమెతా అను యుద్ధంలో వీర మరణం పొందారు. ఆయనగారి ఛాతిపై ఖడ్గముల యొక్క బాణములు యొక్క ఈటల యొక్క గాయలు తొంభైవరకు ఉన్నాయని చెప్పబడింది. అంటే శత్రవులతో ఎంతోసేపు, ఎంతో వీరోచితంగా పోరాడి ఉంటారో కేవలం ఛాతిపైనే ఇన్ని గాయాలు అయితే మరి ఇతర బాగాల పరిస్థితి ఏమిటి?

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) వారికి జాఫర్ (రజి) వారి కుమారుడు కనిపిస్తే ఇలా సలాం చెప్పేవారు. (అస్సలాము అలైక యాబ్ నజిల్ జనాహైన్) ఓ రెండు రెక్కలు కల్గిన పెద్దమనిషి కుమారుడా నీకు సలాములు అనేవారు. మహాప్రవక్త (స) వారు జాఫర్ (రజి) వారి గురించి ఇలా అనేవారు. నేను జాఫర్ (రజి) వారిని స్వర్గంలో రెండు రెక్కలతో దేవదూతలతో కలసి ఎగురుతూ ఉండటాన్ని చూసాను. అందుకే జాఫర్ (రజి) వారిని జాఫర్‌తయ్యార్ అని పిలిచేవారు. (బుఖారికితాబుల్ మనాఖిబ్)

జంగే యరముక్ యుద్ధ మైదానములో జరిగిన సంఘటన :

అబుజిహిమ్ బిన్ హుజైఫా (రజి) వారు ఉల్లేఖించారు. యరముక్ యుద్ధ సమయంలో నేను పిన తండ్రి కొడుకును

వెతుక్కుంటూ వెళ్ళాను. ఆయన కూడా యుద్ధంలో పాల్గొన్నాడు. ఒక నీళ్ల తిత్తిలో నీళ్ళు కూడా పట్టుకున్నాను. ఆయన దాహంలో ఉంటే నీళ్ళు త్రాగిద్దామన్న ఉద్దేశ్యంతో అలా వెతుకుతుంటే ఒకచోట వంటి నిండా గాయాలతో విలవిలలాడుతూ కనిపించాడు. వెంటనే నేను దగ్గరకు వెళ్ళి నీళ్ళు త్రాగుతావా అని అడిగాను. 'హ', 'హ' అన్నారు సైగలతో. అంతలో అక్కడే కొంతదూరంలో చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టులాడుతున్న వ్యక్తి యొక్క దాహం, దాహం అన్న హాహాకారాలు నా సోదరుడు విని ముందు ఆతనికి నీళ్ళు ఇవ్వమని సైగ చేశాడు. అంతలో నేను అక్కడకు చేరుకున్నాను. అతడు హుషామ్ బిన్ అబుల్ ఆస్ (రజి) వారు అతని నీళ్ళు ఇవ్వబోతే ఆ ప్రక్కనే మూడో వ్యక్తి పడి ఉన్నాడు. హుషామ్ (రజి) వారు ఆ వ్యక్తికి ముందు నీళ్ళు ఇవ్వమని చెప్పాడు. నేను మూడో వ్యక్తి వద్దకు వెళ్ళాను. అక్కడ చూస్తే ఆయన చనిపోయాడు. సరే అని హుషామ్ (రజి) వారి వద్దకు వచ్చాను. ఆయన కూడా దేవుని సన్నిధి చేరుకున్నాడు. ఆయన దగ్గర నుండి నా సోదరుని దగ్గరకు వచ్చాను. నా సోదరుడు కూడా ఈలోకం నుండి వెళ్ళిపోయాడు.
(ఇబ్నెకసీర్)

ఇది సహబాల యొక్క త్యాగబుద్ధి. తను చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టులాడుతూ ఉన్నా ఇతరుల గురించి ఆలోచించేవారు. అందుకే అల్లాహ్ వారితో రాజిపడ్డాడు. వారికి స్వర్గంలో ఉన్నత స్థానాన్ని కల్పించాడు.

ఇస్లాం కోసం సర్వం వదులుకున్న మరో సహబీ గురించి తెలుసుకుందాం.

జుల్‌బజాదీన్ (రజి) వారు ఇస్లాం ధర్మాన్ని స్వీకరించక పూర్వం ఆయన పేరు అబ్దుల్ ఉజ్జాగా ఉండేది. ఆయన

చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు. తల్లి చాలా పేద కుటుంబం నుండి వచ్చింది. అందువలన ఆయనను పిన తండ్రి ఆదరించాడు. ఆయన యొక్క ఆలనాపాలనా చూసుకున్నాడు. యుక్త వయస్సు వచ్చిన తరువాత పినతండ్రి ఆయనకు కొన్ని ఒంటెలు, కొన్ని మేకలు, ఓ బానిస, కొంత సామాన్లు ఇల్లు అన్ని సమకూర్చి ఇచ్చాడు. మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారు మదీనా వలస వచ్చిన తరువాత అరుబ్బు ప్రాంతంలో దేవుని ఏకత్వము నలుమూలలా వ్యాపించ సాగింది. అలానే జుల్ బజాదీన్ (రజి) వారి హృదయాన్ని దేవుని ఏకత్వాన్ని తాకింది. కాని తానున్న పరిస్థితిని బట్టి తన హృదయంలో ఉన్న విశ్వాసాన్ని బహిర్గత పరచలేకపోయారు. అయినా రోజు రోజుకు ఆయన మనస్సులో ఇస్లాం ధర్మంపై విశ్వాసం ప్రేమ పెరగసాగింది. తనను ఆదరించిన పినతండ్రి ఇస్లాంను వ్యతిరేకించడం వలన ఎప్పటికైనా తన పినతండ్రి మారుతాడని ఎదురుచూడసాగారు. ఇలా నిరీక్షణలో రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడచిపోయాయి. ముస్లింలు మక్కాను కూడా జయించారు. ఇస్లాం ధర్మం నలువైపులా తన సువాసనలు వెదజల్ల సాగింది. మక్కా జయించిన తరువాత కూడ మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) మదీనాలోనే ఉండటానికి నిర్ణయించు కున్నారు. ఇక జుల్ బజాదీన్ (రజి) వారి సహనం నశించింది. నేరుగా తన పినతండ్రి వద్దకు వెళ్ళి మీరు ఎప్పటికైనా ఇస్లాం ధర్మాన్ని అర్థం చేసుకొని ఇస్లాం ధర్మాన్ని స్వీకరిస్తారని భావించాను. మీలో ఎలాంటి మార్పు కనిపించుట లేదు. ఇక నేను వేచి ఉండను. నాకు అనుమతి ఇప్పించండి. నేను ఇస్లాం ధర్మాన్ని స్వీకరిస్తాను అన్నారు.

జుల్‌బజాదీన్ (రజి) వారు ఏ విషయం అయి భయపడ్డారో అదే జరిగింది. ఆయన పినతండ్రి తన నోట నుండి వెలువడిన


ామ్మద్ (స) వారి విధానాన్ని అనుసరించినవాడు స్వర్గంలో ఆయనతోపాటు ఉంటారు.

మాటలు విని అగ్గి మీద గుగ్గిలంగా మారాడు. నీ నిర్ణయం అదే అయితే నేను నీకు సమకూర్చిన ప్రతి వస్తువు నీవు విడిచి వెళ్ళవలసి ఉంటుంది. చివరికి నీవు వేసుకున్న దుస్తులు నావే వాటిని కూడా విప్పిస్తాను. ఒక్క నూలుపోగు కూడా నీకు లేకుండా చేస్తాను అని హెచ్చరించాడు.

ఆ సమయంలో జుల్‌బజాదీన్ (రజి) వారు తన పినతండ్రి తనకు ఇచ్చిన ఆస్తిపాస్తులను ఓ గొర్రెల పొట్టేలులా భావించారు. దాన్ని అల్లాహ్ మార్గంలో (ఖుర్బాని) జబా ఇస్తున్నట్లు భావించి తన పిన తండ్రితో ఇలా అన్నారు. నేను ఇస్లాం ధర్మాన్ని స్వీకరించడం తథ్యం. మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి మార్గాన్ని అనుసరిస్తాను. ఎట్టి పరిస్థితిలోను విగ్రహారాధనకు దేవుని సాటి కల్పించే వారికి సహకరించను. ఇంతకాలం మీరుచేసిన సహాయానికి కృతజ్ఞతలు మీ సంపద మీకు మేలు చేస్తుంది. నేను నమ్మిన ఇస్లాం ధర్మం నాకు మేలు చేస్తుంది. ఈ ఆస్తిపాస్తులు జీవించి ఉన్నంత వరకు ఉపయోగపడొచ్చుగాని నేను మరణించిన తరువాత ఆస్తి అంతస్తులు వదలివెళ్ళవలసిందే అలాంటిది ఇస్లాం ధర్మం కోసం వీటిని ఇప్పడే వదలిపెడితే ఏమిటి. మీరు మొత్తం మీ ఆస్తిని తీసుకోండి అని మొత్తం వదలి వెళుతున్నాను. అలానే మీరు చెప్పిన విధంగా నా దుస్తులు కూడా విడిచి వెళుతున్నాను అంటూ చెప్పలు వంటికి కప్పకున్న దుప్పటి నడుముకు చుట్టుకున్న లుంగీ కూడా విప్పి తన పినతండ్రికి అప్పగించారు.

అటు నుంచి తిన్నగా తన తల్లి వద్దకు వెళ్ళారు. జుల్‌బజాదీన్ (రజి) వారి తల్లి ఆతనిని చూసి కంగారుపడి నాయినా ఏమిటిది ఏమి జరిగింది. ఇలా నగ్నంగా ఉన్నావేమిటని ఆశ్చర్యముతో ప్రశ్నించింది. అమ్మా నేను ఇప్పడు ముస్లిం మువ్వహిద్ అయినాను. నేను ఇస్లాం కోసం సర్వస్వం వదులుకున్నాను. ఇప్పడు నా వద్ద

ఒంటెలు లేవు, గుఱ్ఱాలు లేవు, మేకలు లేవు, సామాన్లు, ఇల్లు, కనీసం తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టలు లేవు. ఇప్పడు ఏమి చెయ్యాలనుకుంటున్నావు అని తల్లి అడిగింది. నేను ఇప్పడు మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారిని కలవడానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. నీవు నాకు నా దేహాన్ని కప్పకోడానికి ఏదైనా వస్త్రాన్ని ఇవ్వు. దానితో నా దేహాన్ని కప్పకుంటాను. అతని తల్లి అతనికి ఓ కంబళి ఇచ్చింది. దాన్ని రెండు ముక్కలుగా చేసుకొని ఒకటి నడుముకి రెండవది భుజాలపై కప్పకున్నారు. ఆయన అక్కడి నుండి మదీనాకు బయలుదేరారు. రాత్రి సమయంలో చేరుకున్నారు. సూర్యోదయం కోసం వేచియున్నారు. తెల్లవారుతుండగా పక్షులు దేవునికి స్తోత్రములు వల్లిస్తున్నాయి. సహాబీలు ఫజర్ నమాజు చదువుటకు మస్జిదే నబవి వైపు వస్తున్నారు. జుల్‌బజాదీన్ (రజి) వారు మస్జిద్‌లోకి ప్రవేశించారు. ఒక గోడకు ఆనుకొని నిలుచున్నారు. మహా ప్రవక్త (సల్లం) కోసం ఎదురుచూడసాగారు. ఇంతలో మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) మస్జిద్ వరండాలోకి వచ్చారు. అక్కడే గోడకు ఆనుకొని నిలుచుని ఉన్న జుల్‌బజాదీన్ (రజి) వారిని చూసి తమరు ఎవరు అని అడిగారు. మహా ప్రవక్త (స) నేను ఓ బీద బాటసారిని. మీ అభిమానిని. సన్మార్గాన్ని వెతుకుంటూ వచ్చాను. నా పేరు అబ్దుల్ ఉజ్జా. అయితే మీరు నా వద్ద ఇక్కడే ఉండిపోండి. ఈ మస్జిద్‌లోనే ఉండండి. నేటి నుండి నీ పేరు అబ్దుల్ ఉజ్జా కాదు అబ్దుల్లాహ్ గా పేరు మార్చుతున్నాను. ఆరోజు నుండి అబ్దుల్లాహ్‌గారు అస్సాబే సూఫాలో చేరిపోయారు. అస్సాబే సూఫా అంటే మస్జిదే నభవి బయట ఓ అరుగు ఉండేది. అక్కడ కొందరు సహాబీలు కూర్చుని మహా ప్రవక్త (స) వారి వద్ద ఇస్లాం ధర్మాన్ని నెరవేర్చుకునేవారు. ఇలాంటి వారినందరినీ అస్సాబే సుఫా అని పిలిచేవారు. అక్కడే

ఉండి అబ్దుల్లాహ్ గారు ఖుర్‌ఆన్ చదవడం నేర్చుకున్నారు. ఆయన ఎల్లవేళలా ఖుర్‌ఆన్ చదువుతూనే ఉండేవారు. ఎంతో ఉత్సాహంగా గట్టిగా చదివేవారు. ఓ సారి ఉమర్ ఫారూఖ్ (రజి) వారు అబ్దుల్లాహ్ (రజి) వారితో ఓ మిత్రుడా ఇంత గట్టిగా నీవు ఖుర్‌ఆన్ చదువుతుంటే మిగిలినవారు నమాజు చదువుతున్నవారికి ఇబ్బందిగా ఉంటుంది అని చెప్పారు. అప్పుడే అక్కడికి వచ్చిన మహా ప్రవక్త (స) ఆ మాటలువిని ఓ ఉమర్ (రజి) అతనిని ఏమి అనకు ఆయన అల్లాహ్ కోసం మహా ప్రవక్త (స) కోసం సర్వం త్యాగం చేసి వచ్చాడు అన్నారు.

హిజిరి 9వ సంవత్సరం ఓ సమాచారం అందింది. అరబ్బు ప్రాంతము లోని క్రైస్తవులందరూ కైసర్ రోమ్ ప్రాంతం వారితో కలిసి ముస్లింలపై దండెత్తి వస్తున్నారని తెలిసింది. అప్పుడు మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారు యుద్ధానికి సిద్ధం కావలసిందిగా చాటింపు వేయించారు. ఆ యుద్ధంలో జుల్‌బజాదీన్ (రజి) వారు పాల్గొని తన ప్రాణత్యాగం చేయాలని నిశ్చయంతో మహా ప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఓ మహా ప్రవక్తా! నా గురించి దు"ఆ" చెయ్యండి. నేను యుద్ధంలో పాల్గొని వీరోచితంగా పోరాడి వీరమరణం పొందాలని, అలా అయితే నీవు వెళ్ళి కట్టుకొనేందుకు ఏదైనా చెట్టు యొక్క పొర వలచి పట్టుకురమ్మని జుల్‌బజాదీన్ (రజి) వారితో మహాప్రవక్త (స) వారు చెప్పారు. చెట్టు యొక్క పొరను పట్టుకువచ్చిన తరువాత ప్రవక్త (సల్లం) వారు దానిని జుల్‌బజాదీన్ (రజి) వారి జబ్బలకు కడుతూ ఇలా దు"ఆ" చేసారు. అబ్దుల్లాహ్ యొక్క రక్తం అవిశ్వాసులపై నిషేదించు ఓ అల్లాహ్.

అది విని జుల్‌బజాదీన్ (రజి) ఆశ్చర్యపోయి మహా ప్రవక్త (సల్లం) నేను యుద్ధంలో పాల్గొని వీరమరణం పొందాలని భావిస్తున్నాను అన్నాను. నీవు ఏమి చింతించకు నీవు అల్లాహ్

మార్గంలో బయలుదేరిన తరువాత జ్వరం వచ్చి చనిపోయినా నీవు వీర మరణంపొందినట్లే అని మహా ప్రవక్త (సల్లం) అన్నారు.

ఇస్లాం సైన్యం తబూక్ వైపు బయలు దేరింది. ఇంకా తబూక్ ప్రాంతానికి దగ్గరలో ఉండగానే మహా ప్రవక్త (సల్లం) చెప్పినట్లే అబ్దుల్లాహ్ (రజి) గారికి జ్వరం వచ్చింది. ఆ జ్వరంతోనే ఆయన చనిపోయారు. హజరత్ అబ్దుల్లాహ్ (రజి) గారు చనిపోయిన విషయం తెలిసి సహబీలంతా కలిసి అక్కడకు చేరుకున్నారు.

ఇబ్నె హరిష్ ఫిర్‌ని (రజి) వారు ఉల్లేఖించారు. జుల్‌బజాదీన్ (రజి) వారిని సమాధి చేసినప్పుడు చీకటి పడిపోయింది. బిలాల్ (రజి) వారు కాగడా పట్టుకున్నారు. సమాధిపై నుండి జుల్‌బజాదీన్ (రజి) వారి దేహాన్ని అబూబకర్ (రజి) వారు ఉమర్ (రజి) వారు కలిసి తమ చేతులతో ఎత్తుకొని సమాధిలో స్వయంగా మహాప్రవక్త (స) వారు దిగి ఉన్నారు. ఆయనకు అందించారు. ప్రవక్త (స) వారు సమాధి శవాన్ని పరుండ బెట్టినారు. తరువాత శవాన్ని ఖననం తరవాత మహా ప్రవక్త (స) వారు చేతులెత్తి దు "ఆ" చేశారు. ఓ అల్లాహ్ నేను ఈ సాయంత్ర వేళ చనిపోయిన వారితో రాజీ పడ్డాను. నీవు కూడా వారితో రాజీపడు. ఈ దృశ్యాన్ని చూస్తున్న ఇబ్నె మసూద్ (రజి) వారు ఈ సమాధిలో నేను ఉంటే ఎంత బావున్ను అన్నారు.

(సేకరణ సహి ఇస్లామీ వాఖియాత్, హఫీజ్ అబ్దుల్ షకూర్)

ఇలా ఎందరో సహబీలను ప్రవక్త (స) వారు ఇహలోకంలోనే స్వర్గవాసులు అన్న సందర్భాలు ఉన్నాయి. ఒకచోట బదరి సహబీల నుద్దేశించి అంటే మరొకచోట బైతే రిజ్వాన్ సహబీలను గురించి చెప్పబడింది.

ఇప్పుడు మనము ఓ సహాబీయాత్ గురించి తెలుసుకుందాం. ఈమె పేరు ఉమ్మె అయ్‌మన్ (రజి. అ). ఈమే



ంలో పండ్లను మనిషి నిలబడి, కూర్చుని ఏవిధంగానైనా దానిని తెంపుకోగలడు.

జైద్‌బిన్ హారిసా (రజి. అ) వారి భార్య జైద్ (రజి. అ) వారు మహా ప్రవక్త (స) కు ఎంతో ప్రియమైన వారు. ఈయన జంగేమోతా లో వీరమరణం పొందారు. ఉమ్మె అయ్‌మన్ (రజి. అ) వారికి ఇద్దరు కుమారులు. ఇద్దరూ ఇస్లాం కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టినవారే పెద్ద కుమారుడు అయ్‌మన్ (రజి.అ) ఈయన గజవయే హునైన్‌లో వీర మరణం పొందితే హజరత్ ఉసామాబిన్ జైద్ (రజి) గజవయేరూ. వీర మరణాన్ని పొందారు. ఇలా ఈమె ఇద్దరు కొడుకులు భర్త ముగ్గురు ఇస్లాం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసారు. భర్తను, కొడుకులను పొగొట్టుకున్న ఆమె ఎనాడు సహనాన్ని కోల్పోయి మాట్లాడలేదు. ఉమ్మె అయ్‌మన్ (రజి. అ) వారు మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి తండ్రిగారైన అబ్దుల్లాహ్ గారి వద్ద సేవకురాలుగా ఉండేది. అబ్దుల్లాహ్ గారి మరణాంతరం మహాప్రవక్త (స) తల్లిగారైన అమీనా గారికి అబ్దుల్లాహ్ గారి ఆస్తి అప్పగించారు. అందులో ఐదు ఒంటెలు, మేకల మందా విలువైన ఖడ్గం, వెండి ఆభరణాలు ఓ సేవకురాలు ఉన్నాయి. అలా అమీనా గారికి వచ్చిన అమ్మాయే ఉమ్మె అయ్‌మన్ (రజి. అ) ఆమె అసలు పేరు బర్‌ఖ బిన్‌తేసా అలీబా అయిన ఆమె కుమారుడైన అయిమన్ వలన అందరూ ఆమెను ఉమ్మె అయ్‌మిన్ పిలిచేవారు. ఆమే ఉమ్మె అయ్‌మన్‌గానే ప్రసిద్ధిగాం చింది. మహా ప్రవక్త (స) వారి వయస్సు రమారమి 6 సం॥లు ఉంటాయి. ఆ సమయంలోనే ప్రవక్త (స) గారి తల్లి ఆమీన మదీనా వెళ్లి తన వాళ్లను కలసివస్తుండగా మధ్యమార్గంలో అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించి అక్కడనే మరణించారు. ఆ సమయంలోనే మహా ప్రవక్త ముహమ్మద్ (స) ను ఉమ్మె అయ్‌మన్ (రజి. అ) తన గుండెకు హత్తుకొని తల్లి లాలనను ప్రేమను అందించింది. అప్పటి నుండి ఆమె ప్రవక్త (స) వారితోనే ఉంది. మహా ప్రవక్త (స) వారు యుక్త వయస్సు వచ్చినప్పడు ఆమె బానిసత్వం నుండి విముక్తి

కల్గించారు. ఆమెకు అబ్దుబిన్ జయిద్ ఖజ్‌రజితో వివాహం జరిపించారు. వారికి ఓ కుమారుడు కలిగాడు. అతడికి అయిమన్ అని పేరు పెట్టారు. అయిమన్ (రజి. అ) వారు ప్రముఖ సహబీలలో ఒకరు అయిమన్ (రజి. అ) వారు పుట్టిన తరువాత ఆమె అందరూ ఉమ్మె అయిమన్ పిలిచేవారు. ఇదే పేరు నిఖ్‌నేమ్‌గా మారిపోయింది. మహా ప్రవక్త (స) వారు ఇస్లాం బోధిస్తున్న ప్రారంభ సమయంలోనే ఉమ్మె అయిమన్ (రజి) ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు. కాని ఆమే భర్త ఇస్లాంను వ్యతిరేకించాడు. ఆకారణముచేత ఆమే భర్తకు దూరం అయ్యింది. మహాప్రవక్త (స) వారి వివాహం ఖదిజతుల్ కుబ్‌రా (రజి. అ) వారితో జరిగి తరువాత ఖదిజా (రజి. అ) వారి వద్ద బానిసగా ఉన్న జయిద్ బిన్ హారిషా (రజి) వారిని తనకు సహకరించేందుకు తన సేవకై ఖదిజా (రజి) వారి అడిగి తీసుకున్నారు.

మహాప్రవక్త (స) వారు ఉమ్మె అయిమన్ (రజి. అ) మంచి నడవడిక ఎంతో గొప్ప వ్యక్తిత్వం, భక్తిభావం, పవిత్రమైన జీవన విధానమును కల్గి ఉండడాన్ని గమనించిన ప్రవక్త (స) వారు ఆమె నుద్దేశించి ఇలా అన్నారు. ఎవరన్నా స్వర్గ వనితను వివాహ మాడదలచినట్టైతే ఉమ్మె అయిమన్ (రజి. అ) వారిని వివాహ మాడండి. ఉమ్మె అయిమన్ (రజి. అ) వారు నల్లగా ఉండేవారు. ఆమే హబసాకు చెందిన నీగ్రో జాతి స్త్రీ. ప్రవక్త (స) వారి ప్రకటన విన్న జయిద్ బిన్ హారిషా (రజి) ఉమ్మె అయిమన్ (రజి) వారిని వివాహ మాడటానికి నిర్ణయించకున్నారు. ఈ విషయాన్ని మహాప్రవక్త (సల్లం) వారికి చెప్పగా జయిద్ బిన్‌హారిషా (రజి) వారితో ఉమ్మె అయిమన్ (రజి) వారి వివాహము జరిపించారు. వీరికి ఉసామా బిన్ జయిద్ (రజి) కలిగారు. ఈయన అంటే కూడా మహాప్రవక్త (సల్లం) వారికి ఎంతో అభిమానం ప్రేమ.

ఉమ్మె అయిమన్ (రజి. అ) వారిని ఎంతో గౌరవించేవారు. ఆమెను అమ్మాజాన్ అని పిలిచేవారు. ఆయిషా (రజి. అ) వారు ఇలా తెలియజేశారు. ఒకసారి మహాప్రవక్త (స) నీళ్ళు త్రాగుతున్నారు. ఉమ్మె అయిమన్ (రజి. అ) వారు కూడ అక్కడే ఉన్నారు. ప్రవక్త (స)తో నాకు నీళ్ళు రప్పించి ఇవ్వండి అంది. అప్పడు నేను ప్రవక్త (స) వారినే నీళ్ళు రప్పించమని అడుగుతావా అన్నాను. అవును నాకు ఆ హక్కు ఉంది. నేను మహాప్రవక్త (స) కు ఎంతో సేవ చేసాను అంది ఉమ్మె అయిమన్ (రజి. అ) నిజమే అని నాతో చెప్పి మహా ప్రవక్త (స) ఆమెకు ఎంతో వినయంతో నీళ్లను అందించారు.

అనస్‌బిన్ మాలిక్ (రజి) వారు ఇలా తెలియజేసారు. అప్పడప్పడు నేను మహాప్రవక్త (స) వారు ఉమ్మె అయిమన్ (రజి. అ) వారి ఇంటికి వెళ్లేవాళ్లము మమ్మల్ని చూసి ఆమే ఎంతో ఆనందంతో తినటానికి త్రాగటానికి ఏర్పాటుచేసేది మహా ప్రవక్త (స) ఏదైనా కారణంచేత వాటిని తిననట్లు అయితే ఆయనతో గొడవకు దిగేది. అదిచూసి ప్రవక్త (స) వారు చిరునవ్వుతో వాటిని తీసుకొని తినేవారు. ఒకసారి ప్రవక్త (స) వారు ఉపవాసముతో ఉంటే నేను ఉపవాసము పాటిస్తున్నాను అని చెప్పేవారు.

అనస్ (రజి) వారు ఇలా తెలిపారు. ఒకసారి మహాప్రవక్త (స) వారు నేను ఉమ్మెఅయిమన్ (రజి. అ) వారి ఇంటికి వెళ్ళాము ఆ సమయంలో ఆమే తిరగలితో గోధుమలు రుబ్బుతున్నారు. మహాప్రవక్త (స) ఆమెతో ఏమి చేస్తున్నావు అని అడిగారు. రొట్టెలు వండటానికి పిండి రుబ్బుతున్నాను ఇది మా ప్రాంతం హబషా వాసుల విధానం అంది, సరే అయితే తొందరగా పిండిరుబ్బి రొట్టెలు తయారుచెయ్యండి అన్నారు మహాప్రవక్త (స) వారు

ఉమ్మె అయిమన్ (రజి. అ) వారి జీవితంలో ఎన్నో

అద్భుతాలు జరిగాయి. ఉమ్మె అయిమన్ (రజి. అ) వారు మదీనాకు వలస వస్తున్నప్పుడు మధ్య మార్గంలో ఆమెకు విపరీతమైన దాహం వేసింది. అప్పుడు వారివద్ద త్రాగటానికి నీళ్ళు లేవు. దాహంతో గొంతు ఎండిపోతుంది. పెదాలు పిడస కట్టుకుపోయాయి. శ్వాస పీల్చడం కష్టమైపోయింది. ఇంతలో ఓ అద్భుతం ఆకాశం నుండి నీళ్ళతో నిండిన పాత్ర తన వైపునకు నెమ్మది నెమ్మదిగా వస్తుంది. ఆ పాత్రకు తెల్లటి త్రాడు కట్టి ఉంది. ఆ పాత్ర తన ముఖము వద్దకు వచ్చి ఆగింది. ఆమె దానిని అందుకుని తనివితీరా నీళ్ళు త్రాగింది. ఉమ్మె అయిమన్ (రజి. అ) వారు ఇలా వివరించారు. ఆ నీళ్ళు త్రాగిన తరువాత నాకు జీవితంలో ఎప్పడు దాహం వెయ్యలేదు. నేను విపరీతమైన ఎండాకాలంలో కూడా ఉపవాసము ఉండేదాన్ని అయినా నాకు ఆరోజు నీళ్ళు త్రాగిన తరువాత విపరీతమైన దాహం అనేది ఏనాడు నాకు వెయ్యలేదు. అలానే నా గుండెల్లో ఎప్పడు ఓ చల్లని అనుభూతి కలిగేది.

ఉమ్మె అయిమన్ (రజి. అ) వారు మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి ఆధ్వర్యంలో జరిగిన యుద్ధాలలో కూడా పాల్గొంది. జంగె ఉహద్‌లో సైనికులకు నీళ్ళు అందించడం, గాయపడిన సైనికులకు కట్టుకట్టడం వంటివి ఎంతో ఉత్సాహంగా చేసింది. అలానే గజవే ఖైబర్‌లో పాల్గొన్న 20 మంది స్త్రీలలో ఆమే కూడా ఉంది. ఖైబర్ యుద్ధంలో ఆమే కుమారుడు అయిమన్ (రజి. అ) వారి తన గుఱ్ఱం విషపుటాహారం తినటం వలన అది తీవ్రమైన అస్వస్థతకు గురైంది. అందుచేత అయిమన్ (రజి. అ) వారు పాల్గొనలేకపోయారు. దానికి ఆమె తన కుమారుడి చర్యను పిరికిబంద చర్యగా అభివర్ణించింది.


అయిమన్ (రజి. అ) వారు యుద్ధ రంగంలో ఎంతో వీరోచితంగా పోరాడేవారు. గజవహునైన్‌లో ఇస్లాం సైన్యం పట్టు తప్పి చెల్లాచెదురు అయిపోయాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో


అయిమన్ (రజి. అ) వారు మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారికి రక్షణగా నిలచారు. ఇలా నిలిచిన వారిలో అబూబకర్ (రజి), ఉమర్ (రజి) అలీ (రజి) అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్ బిన్ హారిష్ బిన్ అబ్దుల్ ముతల్లిబ్ (రజి) హారిషాబిన్ నౌమాన్ (రజి) ఉసామాబిన్ జయిద్ (రజి) వారు ఉన్నారు. ఇదే హునైన్ యుద్ధంలో అయిమన్ (రజి) వారు వీర మరణాన్ని పొందారు. ఇంతటి వీరుడ్ని కూడా ఉమ్మే అయిమన్ (రజి. అ) వారు ఒక్క యుద్ధంలో పాల్గొనలేదని తన కన్న కొడుకునే పిరికిబంధ అన్న గొప్ప వనిత ఉమ్మె అయిమన్ (రజి. అ) వారు తన భర్త తన ఇద్దరు కొడుకులు యుద్ధంలో ప్రాణాలు అర్పించినందుకు గర్వపడేది. (సాబియాత్ ముబష్షిరాత్)

అల్లాహ్ వీరితో రాజీపడ్డాడు. వీరు అల్లాహ్‌తో రాజిపడ్డారు.


ఇలాంటి సహబీ, సహబీయాత్ ఎంతోమంది గురించి హదీసు గ్రంథములో చెప్పబడింది. వీరికి ఇహ లోకములోనే స్వర్గం భోగాల శుభవార్త తెలియజేయబడింది. జంగె బదర్‌లో పాల్గొన్న వారి గురించి బైతే రిజ్వాన్‌లో పాల్గొన్నవారి గురించి కూడా శు భవార్త ఇవ్వబడింది. మనము కూడా స్వర్గాన్ని పొందాలను కున్నప్పుడు వీరి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి. దేవునిపట్ల భయభక్తులు, సాటి మనిషిపట్ల దయాగుణం, ప్రాణుల పట్ల, జీవరాశులపట్ల కరుణ ఇస్లాంపై స్థిరత్వం వంటివి అలవర్చుకోవాలి. అల్లాహ్ మనందరికి అల్లాహ్ ఓ మోమిన్‌లో ఉండవలసిన లక్షణాలను గురించి వివరించాడో అలాంటి లక్షణాలు మనలో పెంపొందించాలని ఎటువంటి దుర్గుణాల నుండి దూరంగా ఉండాలని మొమిన్‌లను హెచ్చరించాడో వాటి నుండి దూరంగా ఉండే బుద్ధిని అల్లాహ్ మనకు ప్రసాదించాలని ఈ పుస్తకము చదివి ఇందులోని విషయాలను అర్థం చేసుకొని ఆచరించే శక్తి, భాగ్యం కల్గించాలని అల్లాహ్‌తో దు"ఆ" చేయుచున్నాము.


إن الشرك لظلم عظيم
దేవునితో సాటి కల్పించుట మహాపాపం
(ఖుర్ఆన్)
ناشر بہادر



ప్రవక్త బాట స్వర్గానికి బాట
BAHADUR



إن الدين عند الله الإسلام
اسلام پر غیر مسلمین کے چند سوالات کے جوابات
ముస్లిమేతరుల కొన్ని ప్రశ్నలకు జవాబులు
ناشر بہادر



بسم اللہ الرحمن الرحیم
ముస్లిం జీవనసరళి
مسلمان کے آداب زندگی
అనువాదకులు
రుస్తుంఖాన్ & బహాదుర్
ناشر: بہادر


ఖుర్ఆన్ మరియు సైన్స్
సృష్టి అంతా అల్లాహ్‌దే, దానిపై ఆధిపత్యము ఆయనదే (7 : 54)
ناشر بہادر
Translated by : M. Zakir Sattar
BAHADUR


Compiled by : BAHADUR




Translated in Telugu by : BAHADUR
తెలుగు అనువాదం : బహాదుర్


UNIVERSAL PROPHETS
PRAYERS
Dua's
ناشر بہادر
Compiled : BAHADUR